www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025
సంపుటి :06 సంచిక : 271 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## రాష్ట్రపతి నిలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ (నేషనల్ సైన్స్ డే) వేడుకలు

వెలుతురు 27 ఫిబ్రవరి , హైదరాబాద్:
జాతీయ సైన్స్ దినోత్సవ (నేషనల్ సైన్స్ డే )

మిగతా3లో..



## ముగిసిన మహాకుంభ మహోత్సవం

- శివరాత్రి స్నానాలతో కుంభమేళాకు ముగింపు
- నభూతో..న భవిష్యత్ అన్న అందంగా సాగిన క్రతువు

ప్రయాగరాజ్,ఫిబ్రవరి27( వెలుతురు):

మహాకుంభమేళా సంబరం ముగిసింది. అనూహ్యంగా ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా ఈ ఆధ్యాత్మిక క్రతువు సాగింది. కోట్లాదిమంది హాజరై పుణ్యస్నానాలు చేసిన ఇతివృత్తం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పవచ్చు. ఓ రకంగా ఇది న భూతో..న భవిష్యత్ అన్న తీరుగా సాగింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టం బుధవారంముగిసింది. జనవరి 13న మొదలైన ఈ మహా

మిగతా2లో..

# రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్



(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 27: "రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్.హైదరాబాద్ రైజింగ్. అన్నప్పుడు మొదట్లో కొందరు సందేహాలు వ్యక్తం చేశారు. జరుగుతున్న పరిణామాలతో ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. ప్రపంచమంతా ఒప్పుకుంటోంది. తెలంగాణ రైజింగ్.హైదరాబాద్ రైజింగ్.ఇక ఆగదు" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.హైదరాబాద్ మాదాపూర్‌లో హెచ్‌సీఎల్ టెక్స్ గ్లోబల్ డెలివరీ సెంటర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "ప్రస్తుతం హైదరాబాద్, తెలంగాణ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా, రాష్ట్రంగా మారిందని చెప్పారు.హైదరాబాద్ పోటీ.ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు నగరాలతో కాదని, ప్రపంచ స్థాయి నగరాలతో తమ పోటీ అని అన్నప్పుడు అదో పెద్ద కలగా అభివర్ణించారు. కానీ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్న తీరు నంబర్ 1 గా



నిలిచినప్పుడు, రాష్ట్రాన్ని డేటా సెంటర్ల హబ్‌గా, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్, స్కిల్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ రంగాల్లో తెలంగాణను మార్గదర్శిగా మార్చినప్పుడు ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. ఇక

మిగతా3లో..

మాదాపూర్ లో హెచ్ సి ఎల్ టెక్స్ గ్లోబల్ డెలివరీ సెంటర్ ను ప్రారంభించిన సీఎం రేవంత్

కార్య క్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు,హెచ్ సీ ఎల్ ,సి ఈ ఓ విజయ్ కుమార్, గ్లోబల్ హెడ్ పవన్, ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు

# మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా

- కేంద్రాన్ని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారా
- సిఎం రేవంత్ స్థాయిని మరిచి విమర్శలు
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27( వెలుతురు):

ఎవరిని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారు...ఎవరిని మీరు విమర్శిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో రెండోదశను అడ్డుకున్నట్లు రుజువులు చూపాలని సవాల్ చేశారు. విస్తరణకు పైసా లేకున్నా పనులు ఎలా చేపడతారని కూడా ఎదురు ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా



సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ

మిగతా3లో..

## రెండుమూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం

- సహాయక చర్యల పూర్తికి యుద్ధప్రాతిపదికన చర్యలు
- జగన్‌తో అంటకాగి నీటి చౌర్యానికి సహకరించిన బిఆర్ఎస్
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి27( వెలుతురు):

రెండు, మూడు నెలల్లో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు పునః ప్రారంభిస్తా మని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని అన్నారు.. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు.




మిగతా2లో..

## పనులపై అవగాహన లేక ఇతరులపై నిందలు

- నిపుణులను సంప్రదించకుండానే ఎస్ఎల్‌బీసీ పనులు
- ఎస్ఎల్‌బీసీ ఘటనకు సీఎం రేవంత్‌దే పూర్తి బాధ్యత : కేటీఆర్



మిగతా2లో..



## మరో వివాదంలో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్

- 400 మంది ట్రైనీ ఉద్యోగుల తొలగింపు
- కార్మిక సంఘాల ఆందోళన
- ప్రధాని కార్యాలయానికి ఫిర్యాదు

మిగతా2లో..

## బీఎస్ఎన్ఎల్‌ను పునరుద్ధరణ జరగాలి

- ఎంపీ ఈటల రాజేందర్

- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, కొండా లు

మిగతా2లో..




## ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం

- కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది
- ఎవరికైనా అసౌకర్యం కలిగితే క్షమించండి
- కుంభమేలా ముగింపుపై మోడీ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి27 ( వెలుతురు):

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది

మిగతా2లో..



# నేడు అసెంబ్లీ ముందుకు ఎపి బడ్జెట్

## తొలిసారి బడ్జెట్ ప్రవేశ పెడుతున్న కేశవ్

## సూపర్ సిక్స్ పథకాలపై సర్వత్రా ఆసక్తి

అమరావతి,ఫిబ్రవరి27( వెలుతురు): ఏపీ బ్జడెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. 28న శుక్రవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. ఇప్పటికే వివిధ శాఖలతో ఆయన సమీక్షించారు. తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ బడ్జెట్‌కు ముఖ్య లక్ష్యం రాష్ట్ర వృద్ధి రేటు 15 శాతం సాధించడం, 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడమే. ఇందుకోసం మూలధన వ్యయాన్ని పెంచుతూ, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇకపోతే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. అలాగే హామీలను అమలు చేస్తామని సిఎం చంద్రబాబు కూడా ప్రకటించారు. పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, పరిశ్రమల వృద్ధి, పునరుత్పత్తి శక్తి రంగాల్లో పెట్టుబడులు బ్జడెట్‌లో ముఖ్య ప్రాధాన్యత పొందనున్నాయి. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌ల అభివృద్ధి, తయారీ పరిశ్రమల వృద్ధి తదితర రంగాల్లో ప్రత్యేక నిధులు



కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం అన్నవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తమ

మిగతా2లో..



## బెంగాల్లో దొంగ ఓట్లను చేర్పించిన బిజెపి

- ఇసి సహకారంతో నకిలీ ఓటర్లను చేర్పించారు
- వీటిని తొలగించకుంటే..ఇసి ముందు ధర్నా చేస్తాం
- బెంగాల్ సిఎం మమతా బెనర్జీ హెచ్చరిక

కోల్‌కతా,ఫిబ్రవరి27( వెలుతురు):

పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని దుయ్యబట్టారు.

మిగతా2లో..

## హిందీ రుద్దడంతో స్థానిక భాషలు సర్వనాశనం

- భోజ్‌పురి, బుందేల్ లాంటి భాషలు కనుమరుగు
- మరోమారు హిందీపై అక్కసు వెళ్లగక్కిన స్టాలిన్

మిగతా2లో..

చెన్నై,ఫిబ్రవరి27( వెలుతురు):

ఏకపక్షంగా హిందీ భాష విధింపుతో ప్రాచీన భాషలు ఉనికిలేకుండా



# ముగిసిన మహాకుంభ మహోత్సవం

కుంభమేళా.. మహా శివరాత్రి పర్వదినంతో ముగిసింది.. చివరి రోజున భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాకుంభమేళాలో మహాశివరాత్రి రోజున 2.5 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున 45 రోజుల పాటు జరిగిన మహాకుంభమేళాలో ఇప్పటివరకు 65 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్టు యూపీ ప్రభుత్వం వెల్లడించింది.. చివరి రోజున గణాంకాలు చూసుకుంటే.. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.. ఏడు శైవ అఖారాలకు, మహాకుంభ్-2025 బుధవారం నాడు గొప్ప ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలతో మహాశివరాత్రి నాడు ముగిసింది. ఊరేగింపులో భాగంగా, 10,000 మందికి పైగా నాగ సాధువులు, పండుగ ఉత్సాహాన్ని పెంచుతూ, కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలతో, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ 'హర్ హర్ మహాదేవ్' నినాదాల మధ్య పాడుతూ, నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. శివరాత్రి రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. చివరిరోజున కుంభమేళాలో భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు.. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే వారిలో మరింత భక్తిభావం పెంచేలా ఇలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వదినం కూడా కలిసిరావడంతో 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీసంగమం ఘాట్లు మార్మోగాయి. కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే పెద్దసంఖ్యలో ఘాట్ల వద్దకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి కూడా భక్తుల బృందం ఒకటి తరలివచ్చింది. కుంభమేళా ప్రాంతంలోని అయిదు ప్రధాన శివాలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలీవుడ్ ప్రముఖనటి ప్రీతి జింటా బుధవారం త్రివేణీసంగమంలో పుణ్యస్నానం చేశారు. కుంభమేళాకు తాను రావడం ఇది మూడోసారి అంటూ ఆమె తన 'ఎక్స్' హ్యాండిల్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సీనియర్ అధికారులతో కలిసి గోరఖ్‌పుర్ కంట్రోల్ రూములో తెల్లవారుజామున 4 గంటల నుంచే ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనవరి 13న మొదలై నాగ సాధువుల ఊరేగింపులు, మూడు అమృత స్నానాలతో వైభవంగా 45 రోజులపాటు కొనసాగిన మహా కుంభమేళా ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మొత్తం 65 కోట్లమంది భక్తులు కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానాలు చేశారు. జనవరి 29 నాటి రెండో అమృతస్నానం సందర్భంగా రద్దీ వల్ల జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు చనిపోయిన విషాద ఘటన రాజకీయ దుమారం రేపింది. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్‌ఛుక్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, సినీతారలు, క్రీడాకారులు త్రివేణీసంగమంలో పుణ్యస్నానాలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా భారత వాయుసేన పైలట్లు అద్భుతమైన వైమానిక విన్యాసాలు ప్రదర్శించారు. కుంభమేళాలో భాగంగా మహా శివరాత్రి రోజు చివరి అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతుండటంతో మరోసారి యూపీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ ఆంక్షలను అమలు చేస్తూ? అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాన్ని ఇప్పటికే నో వెహికిల్ జోన్‌గా ప్రకటించి.. సిబ్బందిని భారీగా మోహరించారు. కాగా.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు సీనియర్ అధికారులతో మాట్లాడుతూ.. శివరాత్రి వేడుకలు సజావుగా జరిగేలా చూశారు.

# నేడు అసెంబ్లీ ముందుకు ఎపి బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి..)
పథకాల అమలుకు తగినంత నిధులు కేటాయించడమే కాకుండా, వాటి ఆర్థిక ప్రభావాన్ని సమీక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్దపీట వేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కీలకమైనవి. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరికొన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని ప్రకటించారు. ఈ హామీల అమలుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం మూడేళ్లలో రూ.60,000 కోట్ల వ్యయంతో అమరావతిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రూ.30,000 కోట్ల పైగా రుణాలకు హామీ తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సందర్భంగా దీనిపై మరింత స్పష్టత ఇవ్వనుంది. ఆర్థిక శాఖకు 28 శాఖల బడ్జెట్ సమీక్షలు పూర్తి కావడంతో, మంత్రులంతా తమ శాఖలకు అధిక నిధులు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ మంత్రిత్వ శాఖ మాత్రమే రూ.37,000 కోట్లు కోరగా, ప్రభుత్వం రూ.27,000 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఈ పూర్తి స్థాయి బ్జడెట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్థిరపరిచేలా, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమల పెట్టుబడులకు సమతుల్యత కల్పించేలా ఉండబోతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## బెంగాల్లో దొంగ ఓట్లను చేర్పించిన బిజెపి

వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన దీదీ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా భాజపా ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హరియాణా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దిల్లీ, మహారాష్ట్రల్లోనూ భాజపా ఈ తరహా వ్యూహాలను అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని భాజపాకు తెలుసునని, అందుకే తప్పుడు జాబితాను రూపొందించే పనిలో పడిందన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (భాజపా) బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

## హిందీ రుద్దడంతో స్థానిక భాషలు సర్వనాశనం

పోతున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బలవంతంగా హిందీని రుద్దడం వల్ల 100 ఏళ్లనాటి 25 భాషలు నాశనమయ్యాయని గురువారం నాడిక్కడ అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లు హిందీ రాష్ట్రాలు కావని, ఆయా రాష్ట్రాలకు చెందిన వాస్తవ భాషలు ఇప్పుడు గతానికి సంబంధించినవిగా మారాయని అన్నారు. హిందీ యుపి మాతృభాష కాదని, ఆ రాష్ట్ర ప్రాచీన భాషలైన భోజ్‌పురి, బుందేల్‌ఖండి (బుందేలీ) భాషలను కోల్పోయిందని అన్నారు. ఉత్తరాఖండ్ కుమావోనిని కోల్పోయిందని, రాజస్థాన్, హర్యానా, బీహార్, ఛత్తీస్‌గఢ్‌లలో స్థానిక భాషల ఉనికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతిని, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడికి దిగుతోందని మోదీ ప్రభుత్వానికి చురకలంటించారు. తమిళం పట్ల ప్రధాని మోదీకి గౌరవం ఉందన్న వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో బుధవారం ముగిసిన కుంభమేళాలో, తమిళ సంగమం (వారణాసిలో) సమయంలో హిందీయేతర భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. హిందీని విధించడంపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తారు. ఏ రాష్ట్రంలోనైనా పాఠశాల విద్యార్థులు ఏ భాషనైనా నేర్చుకోవచ్చని సూచిస్తున్నారు. కానీ వాస్తవానికి తమిళాన్ని ఓ సబ్జెక్టుగా అందించడం లేదని అన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా ఫార్ములా ప్రకారం అన్ని రాష్ట్రాలు సంస్కృతానికి ప్రాధాన్యత ఇస్తాయని అన్నారు. ద్రావిడ ఉద్యమం ద్వారా మాత్రమే తమిళం రక్షించబడుతుందని అన్నారు. అండమాన్‌లో తప్ప ఎక్కడా తమిళం నేర్పడం లేదని, కేంద్రీయ విద్యాలయాల్లో తమిళ భాషా ఉపాధ్యాయులు లేరని అన్నారు. పాఠశాలల్లో కనీసం 15 మంది విద్యార్థులు తమిళాన్ని ఎంచుకుంటేనే ఉపాధ్యాయులను నియమిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి చెప్పారని అన్నారు. రాజస్థాన్‌లోని పాఠశాలల్లో ఉర్దూ స్థానంలో సంస్కృత ఉపాధ్యాయులను నియమించారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, తమిళనాడు లోని అధికార డీఎంకేల మధ్య హిందీ భాష విషయంలో మాటల యుద్ధం నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. '100 ఏళ్లలో ఉత్తర భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయి. భోజ్‌పురి, మైథిలీ, బుందేలీ, గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢి, సంథాలీ, అంజికా ఇలా అనేక భాషలు మనుగడ కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రతిఘటిస్తున్నాం. జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారు' అని స్టాలిన్ రాసుకొచ్చారు. తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.మరోవైపు.. భాజపా, డీఎంకేల మధ్య వివాదం చిన్నపిల్లల కొట్లాటలా ఉందంటూ తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ వ్యాఖ్యానించారు.

## ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం




మంది భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసా గుతోం దని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

## నేడు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి రాక

- గాంధీభవన్‌లో ఫ్లెక్సీల ఏర్పాటుకు నో



**హైదరాబాద్,పిబ్రవరి27(ఆర్‌ఎన్‌ఎ):**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల నూతన బాధ్యురాలుగా నిమితులైన మీనాక్షి నటరాజన్ శుక్రవారం హైదరాబాద్ రానున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇకపై బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని ఆ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను ఆదేశించింది. ఆమె నియామకం ఖరారు అయిన తర్వాత... తొలిసారిగా శుక్రవారం హైదరాబాద్ వస్తున్నారు.దీంతో ఆమెకు స్వాగతం పలికేందుకు పార్టీలోని నేతలంతా సమాయత్తమవుతోన్నారు. మీనాక్షి నటరాజన్.. హైదరాబాద్ వస్తున్న సందర్భంగా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని.. అలాగే శాలువాలు, బోకేలు తీసుకు రావద్దంటూ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. గాంధీ భవన్ ఆవరణలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధఈ ఫొటోలు మాత్రమే ఉండాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గాంధీ భవన్ ఆవరణలో ఉన్న ఇతర నేతల ఫొటోలు, కటౌట్లను సిబ్బంది తొలగించారు. ఇక మీనాక్షి నటరాజన్ రాకతో గాంధ భవన్ రూపు రేఖలు మారనున్నాయనే ఓ చర్చ సైతం ప్రారంభమైంది. మరోవైపు నేడు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మీనాక్షి నటరాజన్ హాజరుకానున్నారు. అలాగే పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు సీనియర్లు సైతం హాజరు కానున్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలిగా ఇటీవల వరకు దీపా దాస్ మున్షి వ్యవహరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు కొత్త వ్యవహారాల బాధ్యులను నియమించారు. ఆ క్రమంలో తెలంగాణకు మీనాక్షి నటరాజన్‌ను నియమించారు.



(మొదటి పేజీ తరువాయి..)

## రెండుమూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం

అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్దాలు, గొబెల్స్ ప్రచారమేనని విమర్శించారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీలు గ్రావిటీ ద్వారా వస్తుంటే బీఆర్ఎస్ నేతలె పనులు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. వాళ్లు సరైన పని చేసి ఉంటే తెలంగాణలో 30 టీఎంసీలు నీళ్లు వచ్చి మూడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్ని అందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని చెప్పారు. వారి హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వాళ్ల హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదుల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని చెప్పారు. తాము ప్రజాస్వామ్యతంగా పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. వాళ్లు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి.. 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే కారులో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే.. అస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడావా అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరిగినప్పుడు వారి హయాంలో అడిగే నాథుడే లేరన్నారు. ఇక్కడికి వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు.. పాలమూరు రంగారెడ్డిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నాడు ఏమి చేశారని ప్రశ్నించారు. తనకు హెలికాప్టర్‌లో తిరగాలని తనకు ఏ మాత్రం లేదని..తాను గతంలో పైలట్‌ను అని గుర్తుచేశారు. భారతదేశంలో టన్నెల్ ప్రమాదాల్లో అత్యంత నిపుణులను కలిగిన 11 ఏజెన్సీలను తీసుకువచ్చి సమర్థవంతంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు అబద్దాలు అని.. ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

## పనులపై అవగాహన లేక ఇతరులపై నిందలు

**హైదరాబాద్,ఫిబ్రవరి27( వెలుతురు):**
సీఎంకు ఏపని ఎలా చేయాలో తెలియక ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్ల నాటి ప్రాజెక్టు పనులను నిపుణులను సంప్రదించకుండానే ప్రారంభించారని, 8 మంది కార్మికులు టన్నెల్ చిక్కుకోవడానికి అదే కారణమైందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఇతరులను నిందించడం మానుకుని పనిపైన దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో 8 కార్మికులు చిక్కుకున్న ఘటనకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను నిందించడంపై కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డికి పని చేతగాదని మండిపడ్డారు. 'ఆయనకు ఎలా పని చేయాలో తెలియకపోతే ఇతరులపై ఆరోపణలు చేయడం సులభంగా ఉంటుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల కిందటి ప్రాజెక్టు పనులను నిపుణులను, ఇంజినీర్లను సంప్రదించకుండానే మొదలుపెట్టారని విమర్శించారు. అదే ఇప్పుడు 8 మంది కార్మికులు టన్నెల్‌లోపల చిక్కుకోవడానికి కారణమైంది' అని కేటీఆర్ ఆరోపించారు. కార్మికులు టన్నెల్ చిక్కుకుని ఇన్నిరోజులవుతున్నా ఇప్పటిదాకా వారి ఆచూకీ కనిపెట్టలేకపోయారని, వారి బతికున్నారో మరణించారో కూడా ఎవరికీ తెలియదని అన్నారు. రేవంత్ రెడ్డి ఇతరులపై నిందలు వేయడం మానుకుని పనిపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రవర్తన, మాటతీరు ముఖ్యమంత్రి లాగే ఉండాలని, చవకబారు మంత్రి లా ఉండకూడదని అన్నారు.

## మరో వివాదంలో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి27( వెలుతురు):**
ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఇటీవల మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ కంపెనీకి చెందిన మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీ ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కార్మిక యూనియన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా ఈ వ్యవహారం ప్రధానమంత్రి కార్యాలయానికి చేరింది. ఈ బలవంతపు లేఆఫ్‌ల పై ట్రైనీలు పీఎంఓకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తొలగింపులపై ప్రధానమంత్రి కార్యాలయం లో 100కు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు కథనాలు తెలిపాయి. ఈ విషయంలో జోక్యం చేసుకుని తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి తొలగింపులు జరగకుండా చూడాలని ట్రైనీలు కోరినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర కార్మిక శాఖ స్పందించి చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీనికి సంబంధించి కర్ణాటక కార్మిక శాఖకు ఫిబ్రవరి 25నే నోటీసులు పంపించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర కార్మిక శాఖ అధికారులు దర్యాప్తు జరిపి కేంద్రానికి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి ఆరంభంలో మైసూరు క్యాంపస్‌లోని దాదాపు 400 మందిని ట్రైనీలకు ఇన్ఫోసిస్ లేఆఫ్‌లు ప్రకటించింది. ఉన్నపళాన క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై ఇన్ఫోసిస్ ఆ తర్వాత స్పందించింది. వరుసగా మూడు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు వెల్లడించింది. ఈ పరీక్షలు సంస్థ నిబంధనల్లో భాగమేనని, కంపెనీ పురోగతికి కూడా ముఖ్యమని పేర్కొంది. 2022-23 నియామక పక్రియలో భాగంగా 2000 మంది ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేసింది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్ తదితర పోస్టులకు ఎంపిక చేస్తూ, వారికి అదే ఏడాది ఆఫర్ లెటర్లు ఇచ్చింది. వారంతా 2022 బ్యాచ్ ఉత్తీర్ణులు. అన్ని రకాల పరీక్షలను పూర్తి చేసినా వీరిని విధుల్లోకి తీసుకోవడంలో మాత్రం ఆలస్యం చేస్తూ వచ్చారు. దీంతో కంపెనీపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పాటు కార్మిక శాఖ వద్ద ఫిర్యాదు సైతం నమోదైంది. ఈ క్రమంలో రెండేళ్లు ఆలస్యంగా 2024 ఏప్రిల్‌లో వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. అయితే, గతేడాది మైసూరు క్యాంపస్‌లో ట్రైనీలుగా చేరిన వారిలో సగం మందిపై ఇన్ఫోసిస్ వేటు వేయడం గమనార్హం.

## బీఎస్ఎన్ఎల్‌ను పునరుద్ధరణ జరగాలి



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు ,హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 27:**
బీ ఎస్ ఎన్ ఎల్ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం గురువారం జరిగింది, ఇందులో పాల్గొన్న మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారు,బీఎస్ ఎన్ ఎల్ ను పునరుద్ధరణ జరగాలన్నారు, దీనికి హైదరాబాద్ నాంది పలకాలి. దీనికి మా ఎంపీలు అందరం మద్దతుగా ఉంటామని ఈటల రాజేందర్ తెలిపారు,బీఎస్ ఎన్ ఎల్ గొప్ప సంస్థగా ఎదగడానికి కావాల్సిన ప్రణాళిక రూపొందించండి. బీఎస్ ఎన్ ఎల్ సుప్రీం అనేభావన రావాలన్నారు,తాడు బొంగరం లేని సంస్థలు ఎదుగుతున్నప్పుడు, ఇన్ని ఆస్తులు ఉండి.ఇంతమంది మాన్ పవర్ ఉన్నప్పుడు మనం ఎందుకు ఎదగడం లేదని ఈటల రాజేందర్ ప్రశ్నించారు ,ప్రభుత్వరంగ సంస్థలు బాగుపడాలి అనేది ప్రధాన మంత్రి మోదీ ఆలోచన అన్నారు,ఎలక్ట్రానిక్ యుగంలో ఉన్నాం.గవర్నమెంట్ పాలసీలు ఎలా ఉన్నా మీ ఇన్నోవేషన్, కమిట్మెంట్, ప్రయత్నం ఉండాలి. అది ఉంటే మీకు ప్రభుత్వం తోడుగా ఉంటుంది. యువత పాన్ డబ్బాల దగ్గర, చౌరస్తాల దగ్గర నిర్వీర్యం కాకుండా చూడాల్సిన బాధ్యత మనమీద ఉందని ఈటల రాజేందర్ అన్నారు, బిఎస్ ఎన్ ఎల్ లాభనష్టాల కోసం పనిచేసే సంస్థ కాదు. సర్వీస్ అందించే సంస్థ. ఈ ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్ సంస్థలకు ప్రోత్సాహం వహిస్తుంది. హైదరాబాద్ పెద్దన్న పాత్ర పోషించాలని అందుకు మమ్మల్ని వాడుకోండి అని ఎంపీ ఈటల రాజేందర్ కోరారు, ఈ కార్య క్రమంలో ఎంపీ లు అనిల్ కుమార్ యాదవ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి లతో బి ఎస్ ఎన్ ఎల్ అధికారులు సమావేశమయ్యారు.

# చాకలి ఐలమ్మ యూనివర్సిటీ కి కావలసిన నిధులను ప్రభుత్వం ఇస్తుంది

## - ఉప ముఖ్యమంత్రి భట్టి







(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 27:**
వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి కావలసిన నిధులు సమకూరుస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీరనారీ చాకలి ఐలమ్మ యూనివర్సిటీని దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్ దుతామన్నారు,యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్స్ ను పరిరక్షించి పునరుద్ధరణ చేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు,యూనివర్సిటీ నూతన భవన నిర్మాణ ప్రదేశాలు, నమూనాలను ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలించారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు, అలాగే చాకలి ఐలమ్మ స్ఫూర్తి ని స్మరించుకుందాం అంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు , ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి పొన్నం ,ఆయన సతీమణి



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, బ్యూరో, ఫిబ్రవరి 27:**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం హుస్నాబాద్ టౌన్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) లో ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయన సతీమణి,ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయం ఖాయం అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుందని చెప్పారు, ప్రజా సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు, తెలంగాణ ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు,.

# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

- **3న కౌంటింగ్...ఫలితాల ప్రకటన**

**హైదరాబాద్/విజయవాడ,ఫిబ్రవరి27( వెలుతురు):**
తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణల్లో మూడు చొప్పున 6 స్థానాల్లో గురువారం ఉదయం ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఏపీలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 16 జిల్లాల పరిధిలోని 1,062 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 70 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 6,84,593 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రం లోపల క్యూలైన్లో ఉన్నవారందరికీ ఓటేసే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానంలో 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్), గాదె శ్రీనివాసులునాయుడు (పీఆర్టీయూ), విజయగౌరి (యూటీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ప్రధానంగా రాజశేఖరం (కూటమి) రాఘవులు (పీడీఎఫ్) మధ్య పోటీ ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బరిలో 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ఆలపాటి రాజేంద ప్రసాద్ (కూటమి) కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. తెలంగాణలో ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంతోపాటు ఉపాధ్యాయ నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గాలకు కలిపి 90 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మూడు స్థానాల్లో ఓటింగ్ కోసం 973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి : సీఎం రేవంత్ రెడ్డి

- **ఏ ఎం ఆర్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి వినతి**
- **ఏ ఎం ఆర్ సంస్థ ఎం డి మహ్మద్ అలీ రషీద్ తో పాటు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులు,**

(రాపర్తి భాస్కర్ గౌడ్)



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 27:**
తెలంగాణలో వివిధ ప్రాజెక్టులపై సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించాలని ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో గురువారం సమావేశమై వివిధ ప్రాజెక్టులపై నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.2001 లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాల నిర్మాణం



తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఆనాటి ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి ప్రభుత్వం ఎమ్మార్ సంస్థకు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో అయిదుగురు కార్యదర్శుల స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

మరోవైపు కేంద్ర విదేశాంగ శాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు.ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన తాజా చర్చల సందర్భంగా ఈ వివరాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రి గారికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జీషీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015 లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆనాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన మరో కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ ఆప్రతినిధులతో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు.ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలీ రషీద్ అలబ్బర్ నేతృత్వంలో భారత్‌లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా , ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్ ,ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అఫైర్స్ హెడ్ ముస్తఫా





అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ,అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ,ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్

(మొదటి పేజీ తరువాయి..)
హైదరాబాద్ రైజింగ్, తెలంగాణ రైజింగ్ ఆగదు. బహుళజాతి కంపెనీలతో ప్రతి రోజూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం లేదా పెద్ద పెద్ద సంస్థలు హైదరాబాద్ కు రావడం లేదా గతేడాది కుదుర్చుకున్న ఎంఓయూల మేరకు సరికొత్త సౌకర్యాలతో సిద్ధమైన కేఆర్‌సీ సెంటర్ ను ప్రారంభించడం గర్వకారణంగా ఉందన్నారు,కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణ అంతర్జాతీయ, దేశీయ అత్యధిక పెట్టుబడులను ఆకర్షించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ముందుగా అందిపుచ్చుకున్నాం. పైగా రాష్ట్రంలో తక్కువ ద్రవ్యోల్బణాన్ని కాపాడుకున్నాం.తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన రాష్ట్రంగా మార్చుతామని చెప్పినప్పుడు కొందరు సాధ్యం కాదన్నారు. కేవలం దావోస్ లో జరిపిన రెండు వ్యాపార పర్యటనల్లో 40 వేల కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు, 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. ప్రపంచంలోనే అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ సంస్థల్లో ఒకటైన ఆమ్‌జెన్ ను హైదరాబాద్‌కు ఆహ్వానించాం. ప్రపంచంలోనే అత్యుత్తమ జీవ వైవిధ్య సదస్సుల్లో ఒకటైన బయో ఏషియా 2025 ను విజయవంతంగా నిర్వహించాం. ఇప్పుడు హెచ్‌సీఎల్ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నాం. 60 దేశాల్లో డిజిటల్, ఇంజనీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో 2.2 లక్షల మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ దేశ గౌరవాన్ని పెంచిందని సిఎం తెలిపారు,2007 లో హైదరాబాద్‌లో తొలిసారి ప్రారంభమైనప్పటి నుంచి అభివృద్ధి సాధిస్తూ ప్రస్తుతం 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 వేల మంది ఉద్యోగులతో ప్రపంచస్థాయి సరికొత్త సదుపాయాలతో హైదరాబాద్ హెచ్‌సీఎల్ అద్భుతమైన విజయాలను సాధించబోతోంది" అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్సీఎల్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సి. విజయ్ కుమార్ ,సీవీపీ, డిజిటల్ బిజినెస్ గ్లోబల్ హెడ్ పవన్ వాడపల్లి , పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి నిలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ (నేషనల్ సైన్స్ డే) వేడుకలు

(మొదటి పేజీ తరువాయి..)
సందర్భంగా సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈనెల 27, 28 తేదీల్లో రెండు రోజుల వేడకలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, ప్రజలకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించి, వారిని సైన్స్ సంబంధిత కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమంలో వివిధ సమావేశాలు, పోటీలను నిర్వహిస్తున్నారు. సీసీఎమ్‌బీ మాజీ డైరెక్టర్, ఎస్.ఎస్. భట్నాగర్ పురస్కార గ్రహీత డాక్టర్ చింతకగిరి మోహన్‌రావు, ఐసీఎమ్ఆర్ - జాతీయ పోషకాహార సంస్థ మాజీ డైరెక్టర్ డాక్టర్ శశికిరణ్ బొయిండాల, ఎండీ, ఎఫ్ఎఎంఎస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శాస్త్రీయ పరిశోధన-అభివృద్ధి సంబంధిత ప్రాజెక్టుల ప్రదర్శనను, పుస్తక ప్రదర్శనను వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతకగిరి మోహన్ రావు మాట్లాడుతూ... రామన్ ఎఫెక్ట్ గురించి, వర్ణపటశాస్త్రంలో దాని ప్రభావం గురించి విద్యార్థులకు వివరించారు. కాంతిపుంజం పదార్థ అణువుల గుండా విక్షేపం చెందినప్పుడు దాని తరంగదైర్ఘ్యంలో వచ్చే మార్పుల ఆధారంగా రామన్ ఈ దృగ్విషయాన్ని ఆవిష్కరించారని తెలిపారు. ఆకాశం, సముద్రం నీలం రంగులో కనిపించడానికి, వాటిపై పడి విక్షేపం చెందిన కాంతి తక్కువ తరంగదైర్ఘ్యం గల నీలం రంగు కాంతిని వెలువరచడమే కారణమని వివరించారు. డాక్టర్ శశికిరణ్ బొయిండాల మాట్లాడుతూ రోజువారీ అలవాట్ల వెనక గల సైన్స్, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి వివరిస్తూ అనేక ఆరోగ్య





సమస్యలను ప్రస్తావించారు. సరైన పద్ధతిలో వంట చేయడం ద్వారా ఆహారంలోని పోషకాలను ఎలా పరిరక్షించవచ్చు, తద్వారా ఆరోగ్య సమస్యలను ఎలా తగ్గించుకోవచ్చో బిర్యానీ వంటకాన్ని ఉదాహరణగా తీసుకుని విద్యార్థులకు వివరించారు. పేద కుటుంబాల్లో తల్లి సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల తక్కువ బరువుతో పిల్లలు జన్మిస్తున్నారని పేర్కొన్న ఆయన, చిన్న వయస్సులో గుండెపోటు మరణాలు పెరగడానికి ఇదీ ఒక కారణమని తెలిపారు. అధికంగా ప్రాసెస్ చేసిన, తక్కువ పీచు గల ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల ఆఫ్రికావాసులతో పోలిస్తే ఆసియా దేశాల ప్రజల్లో పెద్దపేగు క్యాన్సర్ ఎక్కువగా విస్తరిస్తోందన్నారు. ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా శ్రీ పుణ్యకీర్తి స్వాగత నృత్యం, సైన్స్ విశిష్టత గురించి హకీంపేట సీఆర్పీఎఫ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ శాస్త్రీయ పరిశోధన-అభివృద్ధి ప్రదర్శనల్లో సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ ), సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) వంటి ప్రముఖ సంస్థలతో పాటు జెంట్రిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నెక్స్ట్ స్కిల్స్ 360, మేకర్స్ వర్స్ వంటి అంకురసంస్థలు సైతం పాల్గొన్నాయి. నేషనల్ బుక్ ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శన అలాగే ఇక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా

(మొదటి పేజీ తరువాయి..)
దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు సిఎం రేవంతా లేక తానా అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మైనింగ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామని.. 12 ఖనిజాల రాయల్టీని పెంచామని తెలిపారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని.. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని.. ఈ వేలం ప్రక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్??పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని రేవంత్ ఆరోపించారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా. సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన 5 ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విన్నవించాం. వాటికి అనుమతులు, నిధులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో.. ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కిషన్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు.



# సంపాదకీయం..

## వాణిజ్య పంటలకు మార్కెట్ కల్పించలేని పాలకులు !

రకరకాల వాగ్దానాలు..రకరకాల పథకాలు...రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరలు..ఇలాంటి ప్రకటనలతో ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పించి అధికారంలోకి వస్తున్నా..అన్నదాతల విషయంలో ఏ ప్రభుత్వం కూడా ముందుచూపుతో వ్యవహరించడం లేదు. దీనికంతటికి ఈ దేశంలో సమగ్ర వ్యవసాయ విధానం లేదు. ఏ పంటలు పండించాలి..ఏ పంటలు ఎగుమతి చేయాలన్న దానిపై పాలకులకు అవగాహన లేకుండా పోతోంది. రైతుల నుంచి సమాచారం వచ్చినా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా మనదేశంలో వరి,గోధుమ, జొన్నలు లాంటి తృణధాన్యాలతో పాటు, వాణిజ్య పంటలకు కూడా అవకాశం ఉంది. మన నేతలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. ప్రధానంగా వాణిజ్య పంటలను విపరీతంగా పండించే ఛాన్స్ ఉంది. మిర్చి, పసుపు, పత్తి, అల్లం వెల్లుల్లి లాంటి పంటలను కూడా ఎగుమతులు చేసేలా పండించుకునే వీలుంది. రైతులు చెమటోడ్చి ఈ పంటలను ఏటా పండిస్తూనే ఉన్నారు. అయినా పంటల దిగుబడి రాగానే మద్దతు ధరల పేచీ..ఎగుమతుల విధానంలో పేచీ...ఇలా సవాలక్ష కొర్రీలతోరైతులను ఆగం చేస్తున్నారు. ఇంతెందకు ఇటీవల ఎపిలో మిర్చి పండించిన రైతులకు ప్రభుత్వాలు చుక్కలు చూపుతున్నాయి. తెలంగాణలో మిర్చితో పాటు పత్తి, పసుపు పంటలకు సకాలంలో గిట్టుబాట ధరలు రావడం లేదు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి కబుర్లు చెబుతున్న సిఎం చంద్రబాబు నాయుడు మిర్చి సేకరణ విషయంలో పూర్తిగా విఫలం అయ్యారు. తెలంగాణలోనూ అదే పరిస్థితి. పండించిన పంటలను కొనుగోలు చేసి, పేదలకు తక్కువ ధరలకు అమ్మడం కూడా ఓ రకంగా ఆదుకోవడమే అవుతుంది. ఎగుమతులను పెంచుకోవడం ద్వారా రైతులకు అండగా నిలవవచ్చు. కానీ అలా జరగడం లేదు. రూపాయికే కిలో బియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఈ దండగమారి పథకాన్ని ఎత్తేయడం లేదు. ఉపాధిహామీతో పనికిరాని పనులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఉచిత పథకాలతో కూలీలు కూడా దొరకడం లేదని సుప్రీం జడ్జి వ్యాఖ్యానించినా మొద్దు నిద్ర వీడడం లేదు. తమ భద్రతకు వేలకోట్లు ఖర్చు చేస్తున్న నాయకులు రైతుల కోసం మాత్రం బిచ్చం వేసినట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఎపిలో మిర్చి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో కూడా ఇప్పుడు మిర్చి బాగా పండింది. నిజానికి వ్యవసాయాధారిత పరిశ్రమలను పెట్టి పంటలను కొనుగోలు చేసి, మిర్చి పౌడర్‌ను తక్కువ ధరలకు ప్రజలకు అందించవచ్చు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మార్కెట్లో డబ్బు చెలామణి అవుతుంది. ప్రభుత్వం, ప్రైవేట్ రంగంలో ప్రోత్సాహకాలతో పంటలను అమ్మించే ప్రయత్నం చేయవచ్చు. దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచితే విదేశీ మారకం పెరగగలదు. కానీ అలా చేయడం లేదు. ఎపిలో పీకల్లోతు కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను బేషరతుగా ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడడం కూడా తప్పే. ఇలాంటి సందర్భంలో ఎలా ఆదుకోవాలన్న ఆలోచన లేకుండాపోతోంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెడితేగాని మిర్చి సాగు సాధ్యం కాదు. నారు నాటినప్పటి నుండి పంట చేతికివచ్చేంతవరకు మిర్చి రైతుది దినదిన గండం బతుకే! చీడ, పీడలు, తెగుళ్ల బెడద ప్రతిరోజూ వెంటాడుతున్నది. వీటన్నింటిని అధిగమించి యార్డు దాకా తెచ్చిన సరుకుకు నామమాత్రపు ధర కూడా పలకకపోతే సాగు చేసిన రైతు పరిస్థితి ఏమిటన్న ఆలోచన చేసేదెవరు. ఆదుకోవాలని కోరితే పండిన పంటలో పావు వంతే కొంటామనడం ఏ విధమైన ఊరడంపో అర్థం కాదు. మిగిలిన పంటను ఎవరికి అమ్ముకోవాలన్నది వారే చెబితే బాగుండేది. గత ఏడాది గరిష్టంగా క్వింటాకు 28 వేల రూపాయలు ధర పలికితే, ఇప్పుడు కేవలం 11,781 రూపాయల రేటు ఎలా నిర్ణయించారు. దీనికి ప్రాతిపదిక ఏమిటన్నద ఇపాలకులు వివరించాలి. అది కూడా నెలరోజుల వరకే కొంటామని చెప్పడం మరీ దారుణం. ఈ తరహా విధానాలు మిర్చి రైతాంగానికి పెనుశాపంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం మద్దతుగా ప్రకటించిన 11,781 రూపాయలను ప్రామాణికంగా తీసుకుని గత ఏడాది ధరలతో పోలిస్తే ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు లెక్కలు వేసి చెబుతున్నారు. ఇంత ఘోరంగా పరిస్థితులు ఉంటే, రాష్ట్రంలో ఏ రైతు కూడా కష్టాల్లో లేరని ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం మరీ దారుణం! ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలి. తక్షణం నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించి రైతాంగం కోరుతున్నట్లు క్వింటాకు కనీసం 20 వేల రూపాయల చొప్పున చెల్లించి, మొత్తం పంటను కొనుగోలు చేయాలి. అన్ని రకాల షరతులను ఎత్తివేయాలి. దీనికోసం అవసరమైతే కలిసివచ్చే శక్తులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పాలక కూటమికి రాజకీయంగా ఇబ్బంది అనుకుంటే రైతులను, అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి కేంద్రం వద్దకు వెళ్లాలి. ఢిల్లీ పాలకుల మెడలు వంచి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. ఒకసారి రైతు ఈ ధరకు పావు వంతు సరుకును అమ్మిన తరువాత మిగిలిన సరుకుకు ఎంత ధర పలుకుతుందో తెలియంది కాదు. ట్రేడర్లు అంతకన్నా తక్కువకే కొంటారు తప్ప ధరలు పెంచరు. నెలరోజుల గడువు ముగిసిన తరువాత మార్కెట్‌కు వచ్చే సరుకు పరిస్థితి ఏమిటన్న ఆలోచన కూడా చేయరంటే...వీరికి పంటలపై ఎలాంటి అవగాహన ఉందో తెలుసుకోవచ్చు. ఉదయం లేచింది మొదలు మార్కెట్ ఎకానమి సూత్రాలను వల్లించే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మార్కెట్ ఒడిదుడుకులు, పంటల గురించి అవగాహన లేదనుకోవాలి. లాభాల పంటను, రైతులకు నష్టాల మంటను మిగల్చడం కాక మరోటి కాదు. ఆర్థికంగా రాష్ట్రం అనేక కష్టాలు ఎదుర్కొంటుంటే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటు చేసుకోవాలనడం, ఖర్చులో సగభాగాన్ని రాష్ట్రమే భరించాలని కేంద్రం షరతులు పెట్టడం మరింత దుర్మార్గం. ఇంత నిర్దయగా కేంద్రం వ్యవహరించినా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడానికి సైతం సిద్ధపడకపోవడం బాధాకరం! తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ తీరు, రైతులను ఆదుకనేలా లేదు. సొంతంగా పంటల కొనుగోలు విధానాలు అవలంబించాలి. గుంటూరు మిర్చి యార్డు నుండి చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థారులాండ్‌లకు మిర్చి ఎగుమతులు అత్యధికంగా జరుగుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుండి 1.79 లక్షల టన్నుల మిర్చిని చైనా దిగుమతి చేసుకుంది. వీటి విలువ 4,123 కోట్ల రూపాయలు! అయితే, అమెరికాతో అంటకాగే విధానాల్లో భాగంగా చైనాతో పాటు పలు ఇతర దేశాలకు చేసే ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టింది. ఫలితంగా ఎగుమతుల మార్కెట్ భారీ స్థాయిలో క్షీణించి, నిల్వలు పేరుకుపోయాయి. రైతాంగం ఆందోళన నేపథ్యంలో చైనాతో ఆర్డర్లను పునరుద్ధరించడానికి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ప్రయత్నించినప్పటికీ కేంద్రం నుండి సానుకూల స్పందన రాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. సమగ్ర పంటల విధానం అవలంబించాలి. ఎగుమతులు దిగుమతులపై సమీక్షించాలి. అప్పుడే వ్యవసాయరంగం పురోగమించగలదు.

# వికసిత భారత్ - వికసిత బడ్జెట్
# కేంద్ర బడ్జెట్ 2025-26

## వృద్ధి, సాధికారత, అమృత కాలానికి రెడ్ కార్పెట్ బడ్జెట్

కేంద్ర బడ్జెట్ 2025-26 అనేది భారతదేశాన్ని వికసిత భారత్ వైపు దోహదం చేసే ప్రణాళిక. ఇది ఆర్థిక స్థిరతను పెంపొందించడంతో పాటు, సామాజిక సమానత్వం, సాంకేతిక ఆధిపత్యాన్ని లక్ష్యం గా చేసుకొని రూపొందించబడింది. స్వయం సమృద్ధి, శక్తివంతమైన భారతదేశం వైపు ప్రయాణం చేయడానికి ఇది పునాది వేస్తోం ది.సర్వం పరవశం దుఃఖం, సర్వమాత్మవశం సుఖమ్? అతి ముఖ్యంగా ఆర్థిక సుస్థిరత్య కుటుంబానికి, దేశానికి ఒక ఆత్మస్థైర్యాన్ని ఇస్తుం ది. అందుకే పెద్దలు "ధనమ్మూలం ఇదం జగత్తు" అని ఎప్పుడో చెప్పారు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మధ్య తరగతి భారతదేశ అభివృద్ధికి పునాది. అయితే, పాలసీ నిర్ణయాల్లో ఇది చాలాసార్లు వెనుకబడిపోయింది. ఈ బడ్జెట్ ఈ పరిస్థితిని మార్చడం ద్వారా మధ్య తరగతికి మరింత ప్రాధాన్యం కల్పించింది. తక్కువ పన్నులు, హోమ్ ఓనర్షిప్ ప్రోత్సాహకాలు, స్టార్టప్ల కు మద్దతు వంటి ప్రణాళికలతో ఈ వర్గం ఆదాయాన్ని పెంచేలా, దేశీయ వినియోగాన్ని గణనీయంగా అభివృద్ధి చేసేలా రూపొందించబడింది. అందుకొరకె మొదటి సారి గరీబీ హటావో నుండి అమిర్ బానవో ( పేదరిక నిర్మూలన నుండి, బహుజనులను ధనవంతులను చేయడం ఎలా ? ) అని ఒక బడ్జెట్ మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

అదనంగా, అమృత కాలం 2047 కు భారతదేశాన్ని సిద్ధం చేయడానికి ఈ బడ్జెట్ ప్రగతికి హైవే లా పనిచేస్తుం ది. $5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ గా మారేందుకు వ్యవసాయం, పరిశ్రమ, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, మహిళల సాధికారత రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి.భారత దేశ ఆర్థిక వ్యవస్థ మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి మీద ఆధారపడి ఉంటది. ప్రజల ఆర్థిక శక్తి పెంచినప్పుడే, భారత ఆర్థిక శక్తి పెరుగుద్దనే అంశాన్ని మోడీ గారి ప్రభుత్వం గుర్తిం చింది. ఈ బడ్జెట్ ప్రజల కొరకు, ప్రజలచే, ప్రజలు ప్రవేశ పెట్టిన ఆర్థిక పరివర్తన బడ్జెట్.

### కేంద్ర బడ్జెట్ 2025-26 నవ రత్నాలు

**1. మధ్య తరగతి సాధికారత - ఆర్థిక రంగానికి ఆయువుపట్టు.**

*"భారతదేశానికి మధ్య తరగతే ప్రగతికి ఇంజిన్, అది బలంగా ఉంటే దేశ భవిష్యత్తు ప్రకాశిస్తుంది."*

*దశాబ్దాల తర్వాత మధ్య తరగతికి ఈ బడ్జెట్ గణనీయమైన ఉపశమనం కలిగించింది:*

- 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు.
- సీనియర్ సిటిజన్లకు ?1 లక్ష టాక్స్ రాయితీ.
- అద్దె గృహాలపై టీడీఎస్ పరిమితి ? 6 లక్షలకు పెంపు, రెంటల్ భారం తగ్గింపు.
- ఆదాయపు పన్ను సమర్పించడానికి రెండు నుండి నాలుగు ఏండ్లకు పెంపు పెంపు.

**2. అన్నదాత - దేశానికి అక్షయ పాత్ర**

*"అన్నదాతలు నిండిన తృప్తితో ఉంటే దేశం నిండుగా వికసిస్తుం ది."ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రైతును శక్తివంతం చేయటానికి పీఎం కిసాన్ , మద్దతు ధర, ఎరువుల సబ్సిడీ, ఫసల్ భీమా యోజన, సాయిల్ హెల్త్ కార్డు, అగ్రి ఇన్ఫ్రా ఫండ్, హార్టికల్చర్ మిషన్, కిసాన్ మాన్ ధన్ యోజన ఇలా ఎన్నో అమలు చేటున్నారు. వాటికీ తోడు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు బడ్జెట్ లో ఈ చర్యలు తీసుకోబడాయి:*

- కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితి 3 లక్షల నుంచి 5 లక్షలకు పెంపు.
- పప్పు ధాన్యాల ఉత్పత్తిని పెంచి పోషక భద్రత, ఆత్మనిర్భరత పెంపు.
- ధన ధాన్య కృషి యోజన ద్వారా 100 కరువు జిల్లాలను పచ్చదనంతో అభివృద్ధి.

**3. యువత - దేశ భవిష్యత్తు**

*"నైపుణ్యంతో నిండిన యువత ఉన్న దేశం ఎప్పుడూ అభివృద్ధిలో ముందుంటుంది. "యోగః కర్మసు కౌశలమ్ ఎవ" అంటే విద్యతో పాటు నైపుణ్యం అత్యంత విలువైంది కాబట్టి, యువతను నైపుణ్యంతో ప్రభావితం చేయటానికి ఎన్నో పథకాలు రచించారు.*

*విద్య, పరిశోధన, నైపుణ్య అభివృద్ధికి భారీ పెట్టుబడి:*

- 5 జాతీయ నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు.
- 6,500 కొత్త IIT సీట్లు, 10,000 MBBS సీట్లు, 50,000 అటల్ టింకరింగ్ ప్రయోగశాలలు.
- పీఎం పరిశోధనా సహాయ వేతనం 10,000 విద్యార్థులకు.
- కృత్రిమ మేధస్సు అగ్రగామి కేంద్రం ?500 కోట్లు.
- స్టార్టప్ ఇండియా నిధి-?10,000 కోట్లు, మరో 5 ఏళ్ల పొడిగింపు.
- పీఎం ఇంటర్న్షిప్ ప్రోగ్రాం - ?10,831 కోట్లు.

**4. పరిశ్రమ & MSME - అభివృద్ధి దిక్సూచి**

*"ఉద్యోగ కల్పన పెరుగితే దేశ సంపద పెరుగుతుంది."*

*సంస్థాపిత & చిన్న పరిశ్రమలకు భారీ మద్దతు:*

- 1.5 లక్షల కోట్లు MSME క్రెడిట్ గ్యారంటీ.
- వృద్ధి ప్రోత్సాహకాలకు 100% పెంపు.
- సూక్ష్మ సంస్థలకు 15 లక్షల కస్టమ్ క్రెడిట్ కార్డు సౌకర్యం.
- భారత్ ట్రేడ్ నెట్ వ్యాపార లావాదేవీల సులభతరం.

**5. ఆరోగ్య భారత్- ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం**

*"ఆరోగ్యంగా ఉన్న ప్రజలే నిజమైన సంపద."*

*ఆరోగ్య సంరక్షణకు భారీ చర్యలు:*

- 70 ఏండ్లు పైబడిన వృద్ధులకు 10 లక్షల ఆయుష్మాన్ భారత్ ఉచిత వైద్యం.
- 200 క్యాన్సర్ డే కేర్ సెంటర్లు.
- 36 ప్రాణ రక్షణ ఔషధాలు నియంత్రణలోకి తెచ్చి ధరల నియంత్రణ.
- కోటి గిగ్ వర్కర్లకు పీఎం ఆయుష్మాన్ భారత్ వర్తింపు.

**6. నారీశక్తి- సమాజానికి బలం**

*"ఒక మహిళను చదివిస్తే ఒక కుటుంబం వెలుగొందుతుంది."*

**మహిళా సాధికారత కోసం విప్లవాత్మక చర్యలు:**

- 5 లక్షల మహిళా పారిశ్రామికవేత్తలకు 2 కోట్ల టర్మ్ రుణాలు.
- సాక్షం అంగన్వాడీ 2.0 - 1 కోటి తల్లులు, 8 కోట్లు పిల్లలు, 20 లక్షల యువతులకు పోషణ రక్షణ.

**7. సొంతింటి కల - అందరికీ గృహ సౌకర్యం**

*"సొంతిల్లు నెరవేరిన స్వప్నం కాదు, అది భద్రత, గౌరవానికి ప్రతీక."*

- 1.5 లక్షల కోట్లు వడ్డీ రహిత రుణాలు రాష్ట్రాలకు.
- SWAMIH-2 ద్వారా 15,000 కోట్ల హౌసింగ్ ప్రాజెక్టులు.
- 1 లక్ష కోట్లు అర్బన్ ఛాలెంజ్ నిధి ( మౌలిక సదుపాయాల అభివృద్ధి కొరకు)

**8. గతి శక్తి - దేశ అభివృద్ధికి ఇంధనం**

*"మౌలిక సదుపాయాలు అభివృద్ధి అయితే, దేశం వేగంగా ఎదుగుతుంది. "గచ్ఛతి భారత్ శక్తి-పథేన, సమృద్ధిరాస్తు తదాస్తు ఎంగతి శక్తి భరత్ ను సంపూర్ణ శక్తిగా ఎదగటానికి దోహద పడుతుంది.*

- 50 అద్భుత టూరిస్ట్ ప్రదేశాల అభివృద్ధి.
- 50 బౌద్ధ వారసత్వ ప్రదేశాల అభివృద్ధి.
- 100 GW అణుశక్తి ఉత్పత్తి,
- 120 కొత్త విమానాశ్రయాలు.
- భూమి రికార్డుల డిజిటలైజేషన్.

**9. అమృత కాల్ దిశగా భారత్ @ $5 ట్రిలియన్**

*"ప్రతిఘటన నుంచి పునరుద్ధరణకు, భారత్ మహా శక్తిగా మారుతోంది."*

- AI, స్పేస్ టెక్, బయోటెక్ వంటి రంగాల్లో పెట్టుబడి.
- గ్లోబల్ భాగస్వామ్యాలు & ఆత్మనిర్భర భారత్,
- డిజిటల్ భారత్ 2.0.

భారతదేశాన్ని ప్రపంచ మూడవ అర్థ శక్తిగా మార్చుదాం!
"భారతదేశం ధర్మం, కర్మ, అర్థం, మోక్షం కలిసిన భూమి.
ర్థస్య మూలం రాజ్యమిదం, ధనేన రక్ష్యతే రాష్ట్రసంచయః
వినా విత్తం న సంరక్షేత్, సంపన్నో జయతే నృపః||"
ధనం రాజ్యానికి మూలాధారం, సంపదతోనే దేశ రక్షణ సాధ్యం. సంపదలేని రాజ్యానికి సంరక్షణ కరువు, సంపన్న దేశమే విజయం సాధిస్తుంది.



డా. బూర నర్సయ్య గౌడ్
Ms, Fics, Fais, Fmas Former
MP - Telangana

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

### నేలచూపులు చూస్తున్న కొనుగోలుదారులు

### ధరల పెరుగుదలతో సామాన్యులకు అందుబాటులో లేని గోల్డ్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి27( వెలుతురు):** బంగారం ప్రియులకు స్వల్ప ఊరట లభించింది. ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి భారీగా పెరిగాయి. అంతర్జాతీయంగా బంగారం ధరల్లో వృద్ధి చెందటం, ఆర్థిక సంక్షోభం, డాలర్ మారకంలో వచ్చిన మార్పులు లాంటి కారణాలు ఈ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఇక ఇప్పుడు గత రెండు రోజులుగా గోల్డ్ రేట్స్.. నేలచూపులు చూస్తున్నాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ. 280 మేరకు తగ్గగా.. 22 క్యారెట్ల బంగారం రూ. 260 మేరకు తగ్గింది. అటు వెండి ధరలు కూడా బంగారం బాట పట్టాయి. రెండు రోజుల్లో సుమారు రూ. 3100 మేరకు తగ్గింది. అయితే ధరలు పెరిగినప్పుడు ఉన్న దూకుడు తగ్గుదలలో మాత్రం కానరావడం లేదు. దీంతో సామాన్య ప్రజలు బంగారం వైపు చూడడం మానేశారు. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల తులం బంగారం రూ. 80,490గా ఉంది. అలాగే విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 80,490 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల విషయాని కొస్తే.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కేజీ వెండి ధర రూ. 1,05,900గా ఉంది. చెన్నైలో కూడా ఇదే రేటు కొనసాగుతోంది. అటు ముంబై, ఢిల్లీ, కోల్‌కతాలో కిలో వెండి రూ. 97,900గా ఉంది.పేద, సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంతో పసిడికి డిమాండ్ పడిపోతోంది. దీంతో దిగుమతులు సగానికి తగ్గనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారం దిగుమతులు 15 టన్నులకు పరిమితం కానుందని రాయిటర్స్ ఓ రిపోర్టులో పేర్కొంది. ఏడాది క్రితం నాటి దిగుమతులతో పోల్చితే 85 శాతం క్షీణించి.. 20 ఏళ్ల నాటి కనిష్ట స్థాయికి పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలోని 30-35 టన్నుల దిగుమతులతో పోల్చితే దాదాపుగా సగానికి క్షీణించొచ్చని విశ్లేషించింది.



అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ ధర రికార్డ్ స్థాయిలో 2,956 డాలర్లకు ఎగిసింది. అధిక ధరల కారణంగా డిమాండ్ భారీగా తగ్గింది. అమెరికా వాణిజ్య సుంకాల దాడికి తోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఆందోళనలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. వీటికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా క్షీణించి పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. 2025 జనవరిలో బంగారం దిగుమతులు 30-35 టన్నులకు పడిపోయి.. ఆరు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోద య్యాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నెలలో డిమాండ్ మరింత సన్నగిల్లిందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, రికార్డు స్థాయిలో పెరిగిన ధరల కారణంగా ఈ నెలలో బంగారం దిగుమతులు 50 శాతం తగ్గొచ్చన్నారు. దేశంలో వివాహాల సీజన్ కొనసాగుతున్నప్పటికీ డిమాండ్ తక్కువగానే ఉందన్నారు. ధరలు పెరగక ముందు కొన్ని బ్యాంక్‌లు దిగుమతి చేసుకున్న బంగారాన్ని తిరిగి అమెరికాకు పంపిస్తున్నాయన్నారు. దీంతో అధిక రాబడులను పొందుతున్నా యన్నారు. భారత్‌లోని ఆభరణాల తయారీదారుల కోసం టోకుగా ఒక్క ఔన్స్‌పై 23 డాలర్ల తగ్గింపును అందిస్తోన్నాయన్నారు. గతేడాది దీర్ఘకాలంగా అస్థిరంగా ఉన్న ధరలు.. నవంబర్‌లో అకస్మాత్తుగా తగ్గినప్పటికీ.. తిరిగి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. ట్రంప్‌తో ప్రపంచ దేశాల్లో అనిశ్చిత్తి నెలకొనడంతో సురక్షిత పెట్టుబడి కోసం బంగారంపై సెంట్రల్ బ్యాంక్‌లు, బులియన్ వర్తకులు పెట్టుబడులు పెంచారు. దీంతో రెండు, మూడు నెలల్లోనే బంగారం ధరలు 14 శాతం మేర పెరిగాయి. దేశీయంగా బుధవారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.270 తగ్గి రూ.87,970 వద్ద నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.250 తగ్గి రూ.80,650 వద్ద ముగిసింది. వచ్చే నెలలో 10 గ్రాముల ధర రూ.87,300 నుంచి 89,000 వరకు చేరొచ్చని కూడా భావిస్తున్నారు.

## నూతన జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి ని కలిసిన తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:** నూతన జేఎన్టీయూ వీసీ కిషన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి,పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసినట్లు పేర్కొన్నారు.ఇంజనీరింగ్ కాలేజీల్లో నాణ్యమైన విద్యను అందించేవిధంగా కృషి చేయాలని కోరారు. అడ్మిషన్ల నోటిఫికేషన్ ప్రక్రియలో ఏలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని కోరారు.

## ప్రైవేట్ యూనివర్సిటీలలో రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి గారిని కలిసి విజ్ఞప్తి చేసిన విద్యార్థి,సంక్షేమ సంఘం నేతలు లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
ధనార్జనే ధ్యేయంగా పుట్టుకొచ్చిన ప్రైవేట్ యూనివర్సిటీలలో బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉన్నత విద్య మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి గారికి వినతిపత్రం సమర్పించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ ధనర్జనే ధ్యేయంగా పేద ప్రజల రక్తాన్ని జలగల్లా పీడిస్తూ లక్షలకు లక్షల రూపాయలు బడుగు బలహీన వర్గాల విద్యార్థుల దగ్గర వసూలు చేస్తున్నారని కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రైవేట్ యూనివర్సిటీలు విఫలమయ్యాయని అన్నారు.కొన్ని యూనివర్సిటీలు ఏలాంటి అర్హతలు లేకుండా అక్రమార్గంలో దొంగ పత్రాలు సృష్టించి అధికారులను మచ్చిక చేసుకొని, ముడుపులు ఇచ్చి NAAC,NBA అక్రీడియేషన్ పొంది విద్యార్థుల దగ్గర లక్షలకు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని వాటినీ గుర్తించి క్షుణంగా తనీకీలు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్, ఓయూ జెఏసి చైర్మన్ బండి నరేష్ మాల మహానాడు సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ పర్యటించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
హిమాయత్ నగర్ డివిజన్లో కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మరియు జోనల్ కమిషనర్ రవి కిరణ్, దీప్తి కమిషనర్ మారుతి దివాకర్, దత్తానగర్ జనార్దన్ బాద మరియు రెడ్డి కాలనీ లో పర్యటించడం జరిగింది, గతంలో జిహెచ్ఎంసి అధికారులు హుస్సేన్ సాగర్ రిటర్నింగ్ వాల్ నిర్మించడం జరిగింది, రైన్ వాటర్ అవుట్ పుట్ పైప్ లైన్ సరిగ్గా వెయ్యకపోవడంతో, బస్తీ వాసులు కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారి దృష్టికి రాబోయే వర్షాకాలంలో మళ్లీ వర్షపునీలు బస్తీలోకి వచ్చే అవకాశం ఉండదని చెప్పడం జరిగింది. కార్పొరేటర్ మేడం గారు వెంటనే ఈ యొక్క సమస్యను జోనల్ కమిషనర్ రవి కిరణ్ గారి దృష్టికి తీసుకు రావడం జరిగింది, యొక్క ఔట్పుట్ పైప్ లైన్ ని వాటర్ బయటికి వెళ్లే విధంగా చేయిస్తామని రూరల్ కమిషనర్ గారు చెప్పడం జరిగింది, అలాగే హిమైత్ నగర్ డివిజన్లోని దత్త నగర్ కమ్యూనిటీ హాల్ లో అంగన్వాడి కేంద్రం నిర్వహిస్తున్నారు, కమ్యూనిటీ హాల్ చాలాకాలంగా పాతబడి గోడలకు పెచ్చులు ఊడడంతో గోడలు పగిలిపోవడంతో యొక్క కమిటీ హాల్ కూడా నూతనంగా నిర్మించాలని కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారు కోరడం జరిగింది, బస్తీ వాసులు చింటూ, కమల, తుల్జారాం, అశ్విన్, ఫారుక్, సర్ఫరాజ్, శేఖర్, జగదీష్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



**వెలుతురు,తుక్కుగూడ 27 ఫిబ్రవరి :**
క్రీడలు మానసిక ఉల్లా సానికి, శారీరక దారుఢ్యానికి దోహ దపడతాయని టోర్నమెంట్ నిర్వా హకులు పద్మారావు అన్నారు. తు క్కుగూడ మున్సిపాలిటీలోని రావి రాల గ్రామంలో ఐపీఎల్ మాదిరిగా ఆర్.పిఎల్ రావిరాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను గురు వారం ఆయన ప్రారంభించారు. అ నంతరం పద్మారావు మాట్లాడు తూ..ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓ డిన వారు నిరుత్సాహం చెంద కుండా రాబోయే ఆటల్లో గెలుపే ల క్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవి తానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయ న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# లిక్కర్ కుంభకోణంతో.. కవితకు చిప్ దొబ్బింది..!

- మోడీతో ఒప్పందం కుదుర్చుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టనది ఎవరో ప్రజలకు తెలుసు
- అహంకారానికి కేరాఫ్ అడ్రస్ సీఎం రేవంత్ కాదు మీ కుటుంబం
- తెలంగాణలో ఈ విషయం పిల్లోడిని అడిగిన చెబుతారు
- మీ అహంకారం, బలుపు వల్లే ప్రజలు మీకు కర్రుకాల్చి వాత పెట్టారు
- 10 ఏళ్లు అధికారంలో ఉండి ఏమి చేశారో..? ప్రజలకు చెప్పాలి
- అవినీతి, అక్రమాలు, కబ్జాలు, ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు
- నోటికి వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు
- ఎమ్మెల్సీ కవిత పై కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరా శోభన్ ఫైర్
- సీఎం రేవంత్ రెడ్డి పై అవాక్కులు చవాక్కులు పేల్చితే తాటతీస్తాం



**వెలుతురు హైదరాబాద్, ఫిబ్రవరి 27:** లిక్కర్ కుంభకోణంలో ఇరుక్కొని ఎమ్మెల్సీ కవిత మైండ్ చిప్పు దొబ్బిందని, దీంతో నోటికి ఏమి వస్తే అది మాట్లాడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ ఎద్దేవా చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే తాట తీస్తామని ఆమె హెచ్చరించారు. సీఎం పై ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అహంకారానికి కేరాఫ్ అడ్రస్ రేవంత్ రెడ్డి అని చెబుతున్న కవిత.. అహంకారానికి ఎవరు కేరాఫ్ అడ్రస్సు తెలంగాణ ప్రజానీకానికి తెలుసన్నారు. మీ అహంకారం, బలుపు వల్లే ప్రజలు మీ కుటుంబాన్ని చీకొట్టి ఫామ్ హౌస్ కు పరిమితం చేశారన్న విషయం తెలుసుకోవాలన్నారు. కర్రు కాల్చి వాత పెట్టిన మీకు గాని, మీ అన్నకు, బావకు గాని ఇంకా బుద్ధి రాలేదన్నారు. ఇంకా దొరతనంతో అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారన్నారు. మీ నాన్న సీఎం గా ఉన్నప్పుడు ప్రగతి భవాని గేటు దగ్గరే ఈటెల, కొంతమంది మంత్రులను, ఎమ్మెల్యేలను మాట్లాడి తిప్పి పంపించిన విషయాన్ని మరిచిపోయావా కవిత అని ప్రశ్నించారు. అలాగే ప్రజా యుద్ధనౌక గద్దర్ను పిలిపించి ఎండలో నిలబెట్టిన విషయం మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. నువ్వు మాట్లాడుతుంటే గురువింద గింజ సామెత గుర్తుకొస్తుందని, దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. పదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఆర్థిక వ్యవస్థ ధ్వంసం, ప్రజల హక్కులను కాలరాయడం, ప్రశ్నించే గొంతులను నొక్కి వేయడం చేసిన సంగతి మరిస్తే ఎలా అని నిలదీశారు. ప్రజల ఆస్తులను కబ్జాలు చేసి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన సంగతి మరిచారా అని నిలదీశారు. ఎస్ ఎల్ బి సి ఘటనలో సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావును అప్రమత్తం చేసి సహాయక చర్యలను వేగవంతం చేశారని, గతంలో ఎప్పుడూ లేనివిధంగా మంత్రులు అక్కడే ఉండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న విషయం మరచి అర్థంపర్థం లేని ఆరోపణలు చేయడం తగదు అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా రాజకీయాలు చేయడం కల్వకుంట్ల కుటుంబానికి చెందింది అన్నారు. మీ నాన్న సీఎం గా ఉన్నప్పుడు ప్రగతి భవన్ దాటి బయటికి వచ్చిన దాఖలాలు లేవన్నారు. కరీంనగర్ జిల్లా కొండగట్టులో బస్సు బోల్తా పడి 60 మంది చనిపోతే పరామర్శించారా..? గజ్వేల్ లో స్కూల్ పిల్లల బస్సు రైల్వే ట్రాక్ మీద పడితే.. పట్టించుకున్నారా..? ఇంటర్ పిల్లలు 30 మంది చనిపోతే మీ నాన్న వెళ్లి పరామర్శించి వచ్చారా..? సమాధానం చెప్పాలి కవిత అని నిలదీశారు. అలాగే నారాయణపేటలో వలసల విషయం, ఆడబిడ్డలను నడిరోడ్డు మీద హత్యలు, మానభంగాలు చేస్తే పరామర్శించకుండా మీ నాన్న ఎక్కడికి పోయారని నిలదీశారు. మీరందరూ ఎక్కడున్నారని ప్రశ్నించారు. మీ తండ్రిలా సీఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ కు పరిమితం కాలేదన్నారు. ప్రజల చేత ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం కాబట్టి ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాన్ని కళ్ళు అప్పగించి చూడాలన్నారు. 24 గంటల్లో 18 గంటలు పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానమంత్రి మోడీని కలిస్తే బిజెపితో కుమ్మక్కయ్యాలని ఆరోపించడం కవితకే చెల్లిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రధానిని కలిసిన ప్రతిసారి మీ కేసుల నుంచి, స్కాముల నుంచి బయటపడడానికి సరిపోయిందని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం, నిధుల కోసం ఏ రోజు మాట్లాడింది లేదన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం, అభివృద్ధి కోసం కలిసి కొట్లాడుతున్న వ్యక్తి మా నేత అన్నారు. బిజెపితో చీకటి ఒప్పందం కుదుర్చుకుంది మీరన్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు అన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టలేదన్నారు. అలాగే జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూడా అభ్యర్థిని నిలబెట్టకపోవడంలో మీ సంబంధం బట్టబయలు అయిందన్నారు. మీరు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని తమకు అంట కట్టాలని చూసే ప్రజలు క్షమించరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐరన్ లెగ్ అంటున్న కవిత అసలైన ఐరన్ లెగ్గు ఆమె అన్న విషయాన్ని మరిచినట్టు ఉన్నారన్నారు. లిక్కర్ కుంభకోణంతో తెలంగాణ ప్రభుత్వంతోపాటు, ఢిల్లీ ప్రభుత్వాన్ని కూడా కూలగొట్టిన విషయం మరిచినట్టు ఉన్నారన్నారు. అసలైన కవితే అన్నారు. కెసిఆర్ మీద కుట్రలు చేస్తున్నారన్న కవిత ఆరోపించారని.. కెసిఆర్ అనే వ్యక్తి సచ్చిన పామని, సచ్చిన పాము మీద కుట్రలు చేసే ఏమి వస్తుందని ప్రశ్నించారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురదజల్లే రాజకీయాలు చేయడం కల్వకుంట్ల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రోజు రోజుకి ప్రజాక్షేత్రంలో సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాధరణ పెరుగుతుండడంతో చూసి తట్టుకోలేని కవిత నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కవిత లిక్కర్ స్కాం నుంచి బయటికి వచ్చి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. అలా కాకుండా అవాకులు చవాకులు పేలితే ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

# ఎండ తీవ్రతతో వైద్యశాఖ తగు ఏర్పాట్లు

- జిల్లాలోని ప్రభుత్వ వైద్యులందరికీ ఎండ తీవ్రత, శాఖా పరంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై శిక్షణ.
- డాక్టర్. వెంకటి, DM&HO , హైదరాబాద్




**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
తెలంగాణలో భానుడు క్రమక్రమంగా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు , వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలో



పెరుగుతున్న ఎండలకు వైద్య ఆరోగ్యశాఖ తగు ఏర్పాట్లు, ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం రోజున యశోద హాస్పిటల్ , సికింద్రాబాద్ ఆడిటోరియంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్, spho,s, MO,s, DEO's తో శిక్షణ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్. వెంకటి DM &HO మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈసారి హైదరాబాదు జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికమయ్య అవకాశాలు ఉన్నాయి. అందులో భాగంగా ఎండ తీవ్రత నుంచి ప్రజలను కాపాడేందుకు జిల్లాలో టాస్క్ ఫోర్స్ లో ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఇందులో జిల్లా కలెక్టర్ చైర్మనుగా వ్యవహరించగా, మన వైద్య ఆరోగ్యశాఖ , పోలీస్, కార్మిక, మహిళా సంక్షేమం, విద్యాశాఖ, ఆర్టీసీ మొదలైన శాఖల జిల్లా అధికారులంతా సభ్యులుగా ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. వారంతా ఎప్పటికప్పుడు తమ శాఖల పరిధిలోని ప్రజలకు జాగ్రత్తలు చెబుతుంటారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈరోజు జిల్లాలోని spho,s, MO,s, DEO'S శిక్షణ ఏర్పాటు చేశామని ఈ శిక్షణలో ఎండ తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని , ఓఆర్ఎస్ పాకెట్స్, మందులు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని , కన్స్ట్రక్షన్ సైట్స్ గుర్తించి అక్కడ పనిచేస్తున్న కార్మికుల కోసం షెడ్డు వేయడం, ఫ్యాన్స్, ఓఆర్ఎస్, నీరు, మజ్జిగ లాంటి పదార్థాలు అందుబాటులో ఉంచాలని కార్మిక శాఖకు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లెటర్ రాస్తూ ఏర్పాటు చేయవలసిందిగా కార్మిక శాఖకు విజ్ఞప్తి చేయాలి. అలాగే బస్ షెల్టర్లలో నీరు, మజ్జిగ ఉంచడానికి రవాణా శాఖతో సమన్వయం చేసుకొని ఉండే విధంగా చూడాలి. NGO's ఏర్పాటుచేసే చలివేంద్రాలలో ఓఆర్ఎస్ పాకెట్స్ ఉంచాలి. ANM/ఆశ సర్వే చేసి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని చలివేంద్రాలు ఉన్నాయి గుర్తించి అందులో ఓఆర్ఎస్ పాకెట్స్ ఉంచాలి. ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రాలలో మరియు బస్తీ దవాఖానాలో ఓఆర్ఎస్/జింక్ కార్నర్స్ పెట్టాలి. అన్ని పాఠశాలలు, మదర్సాలను గుర్తించి అక్కడ ఓఆర్ఎస్ పాకెట్స్ ఉంచాలి. కన్స్ట్రక్షన్ సైట్ లో ఆశా మొబైల్ నెంబరు ఇవ్వాలి , అలా ఇవ్వడం వల్ల అత్యవసరంగా చికిత్స, 108 అంబులెన్సుకు సమాచారం అందించి సత్వర చికిత్స కోసం ఉపయోగపడుతుంది. ఫ్రూట్ మార్కెట్, వెజిటేబుల్ మార్కెట్లలో ఓఆర్ఎస్ పాకెట్లు ఉంచాలి. అంగన్వాడి సెంటర్లు సందర్శించి పిల్లలకు ఎండ తీవ్రత, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు. ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. సిబ్బంది సర్వే చేపట్టాలని కోరారు. SPHO's, MO's తమ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సూపర్వైజర్స్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు (ANM), ఆశలకు తక్షణమే శిక్షణ ఏర్పాటుచేసి ఎండ తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫీల్డ్ విజిట్స్, సర్వే, ఓఆర్ఎస్ పాకెట్స్ , మందులపై సిబ్బందికి అవగాహన కల్పించి ఎండ తీవ్రతకు ఎవరు కూడా అనారోగ్యం పాలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎండ తీవ్రత గురించి ప్రజలు తీసుకొ వలసిన జాగ్రత్తలపై వైద్యులు ఈ విధంగా సూచనలు అవగాహన సిబ్బందికి శిక్షణ ద్వారా కల్పించి ప్రజలు ఎండ తీవ్రతపై ఎవరు అనారోగ్యం పాలు కాకుండా సిబ్బంది ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.

1. ఎండ తీవ్రత వల్ల మన శరీరంలోని నీరంతా చెంప రూపంలో బయటకు వెళ్తుంది. శరీరం డేహైడ్రేషనుకు గురి కాకుండా రోజుకు 5 లీటర్ల మీరు త్రాగాలి.
2. మజ్జిగ తీసుకోవడం మంచిది
3. శీతల పానీయాలు, నూనెతో చేసిన వంట పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది
4. వేడి గాలులు లోపటికి రాకుండా మధ్యాహ్న సమయంలో కిటికీలు తలుపులు మూసివేయాలి.
5. లోపలి గాలి బయటకు వెళ్లేందుకు సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు తెరవాలి
6. కాటన్ దుస్తులు ధరించాలి
7. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు రుమాలు, గొడుగు తీసుకెళ్లాలి.
8. ఈ విషయాలన్నీ ప్రజలందరికీ తెలియజేయాలని ఈ సందర్భంగా DM&HO కోరారు.
9. జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలలో, బస్తీ దవాఖానాలో, ఏరియా హాస్పిటల్ లో ఓఆర్ఎస్ పాకెట్స్, మందులు అందుబాటులో ఉంచాలని వైద్యులను ఆదేశించారు.

ఫీల్డ్ సిబ్బంది, ఆశ వర్కర్లు తమ పరిధిలోని ఏరియాను సందర్శించి, ఎండ తీవ్రత ఏరియాలను గుర్తించి ప్రజలకు అవగాహన, ఓఆర్ఎస్ పాకెట్స్, మందులు ఇవ్వాలని, ప్రతిరోజు నివేదికను జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ కార్యాలయం0 కు పంపాలని కోరారు. ఈ శిక్షణ సమావేశ కార్యక్రమంలో డాక్టర్. ఆశ్రిత రెడ్డి, ప్రోగ్రాం అధికారి (NCD), ప్రోగ్రాం ఆఫీసర్స్, SPHO's, Mo's, జక్కుల రాములు , జిల్లా మాస్ మీడియా అధికారి, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, అకౌంటెంట్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యం

### ఇరు రాష్ట్రాలు జాగ్రత్తగా వాడుకోవాలి

### కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్,ఫిబ్రవరి27( వెలుతురు):**
తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో బోర్డు ప్రత్యేక సమావేశం హైదరాబాద్ జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ




వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సీఈల సమావేశం అనంతరం వివరాలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్ది పాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన నీటిని ప్రణాళికతో వాడుకోవాలని తెలిపింది. పక్షం రోజులకు ఒకసారి పరిస్థితులను సమీక్షించుకుంటూ ముందుకెళ్లాలని సూచించింది.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి నియోజకవర్గం ఇంచార్జ్ చంద్రశేఖర్...



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ తో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 73.26 శాతం, ఉపాధ్యాయ నియోజకవర్గం కు సంబంధించి 94.70 శాతం పోలింగ్ నమోదయ్యిందని అధికారులు తెలిపారు. జహీరాబాద్ పట్టణములోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాని మాజీ మంత్రి జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ సందర్శించి, ఎన్నికల పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారితోపాటు పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, ఖాజా మీయా, గౌస్ , ఇనాయత్, అయుబ్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు తదితరులు యున్నారు.

## శ్రీ కేతకి సంగమేశ్వరుని దర్శించిన కల్బురిగి జిల్లా ఎస్పీ



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండల కేంద్రంలోగల తెలంగాణ రాష్ట్రంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతాకీ సంగమేశ్వర ఆలయాన్ని గురువారం కర్ణాటక రాష్ట్ర కల్బార్గి జిల్లా ఎస్పీ శ్రీనివాసులు సందర్శించారు. ధర్మదాయ దేవదాయ కార్య అధికారులు వారిని స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కేతకి పార్వతి పరమేశ్వరుల అభిషేకం నిర్వహించి మంగళహారతి చేసి పార్వతి పరమేశ్వరులను దర్శించారు. తదనంతరం కల్బురిగి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దక్షిణ ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి వచ్చి పరమేశ్వరుని దర్శించుకోవడంతో నా యొక్క జన్మ ధన్యమైందని వారు పేర్కొన్నారు. ఇక్కడికి తెలంగాణ రాష్ట్రం నుండే గాక కర్ణాటక మహారాష్ట్ర రాష్ట్రం నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని వారన్నారు. కల్బురిగి జిల్లా ఎస్పీ శ్రీనివాసులకు కార్యనిర్వ అధికారి శివ రుద్రప్ప. ఝరాసంగం ఎస్సై నరేష్. పూలమాలవేసి శాలువతో సన్మానించి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి సిబ్బందులు, ఆలయ పూజారులు, కార్యనిర్వాణా అధికారులు, ఆలయ సిబ్బందిలో పోలీస్ సిబ్బందిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదపు అంచుల్లో లారీల బొగ్గు రవాణా

- నిద్రమత్తులో రవాణా శాఖ



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 27**
మంచిర్యాల జిల్లాలో సింగరేణి బావుల నుండి కాల్ యాడుకు బొగ్గు రవాణా చేయడానికి లారీలకు అనుమతులు ఇచ్చారు. అయితే లారీలు 16 నుండి 18 టన్నులు బొగ్గు లోడ్ వేసుకోవాల్సిన లారీలు ఏకంగా డబల్ లోడు తో 35 నుండి 40 టన్నులు బొగ్గులోడు వేసుకొని రవాణా చేయడంతో రోడ్డుపై ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. రోజుకు వందల సంఖ్యలో లారీలు నడుస్తున్న రవాణా శాఖ అధికారులు మాత్రం మొద్దు నిద్రలో చూసి చూడనట్లు వివరిస్తున్నారు ప్రమాదం జరిగితే నష్టం ఎవరికి అని ప్రజలు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ మొద్దు నిద్ర వదిలి కళ్ళు తెరిచి ఓవర్ లోడ్ తో వెళు_న్న లారీలను సీజ్ చేయాలని కొంతమంది వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.




## అంగన్వాడి టీచర్లకు హెల్పర్లకు రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలి

- పండగపూట అంగన్వాడీల పస్తులు...
- ధర్నా చేస్తే తప్ప వేతనాలు ఇవ్వరా...
- రేపటి లోగా ఒక నెల వేతనం ఇస్తామన్నా అధికారులు..
- రెండు నెలల జీతాలు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం...
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్...



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాజెక్టులో అంగన్వాడి టీచర్లకు హెల్పర్లకు వేతనం రాకపోవడంతో పెద్ద ఎత్తున ఇబ్బందులకు గురవుతున్నారని శివరాత్రి పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తక్షణమే వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ ఆధ్వర్యంలో సీడీపీఓ ఆఫీస్ ముందు ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాజెక్టు పట్ల అధికారులకు ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వివరించడం, జహీరాబాద్లో మాత్రం రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఐఎఫ్ఎస్సి కోడ్ పేరుతో నెలల తరబడి నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. రెండు నెలలుగా వేతనం రాకపోవడంతో అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు పెద్ద ఎత్తున ఇబ్బందులు గురవుతున్నారని పెద్ద పండుగ అయిన శివరాత్రి కి కూడా వేతనం ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. మహిళా కార్మికుల్ని పస్తులు ఉంచడం సరైన పద్ధతి కాదని, తక్షణమే అధికారులు వేతనం ఇప్పించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతంగా చేపడుతామని అన్నారు. ధర్నా చేస్తే తప్ప జహీరాబాద్ ప్రాజెక్టులో వేతనం వచ్చే పరిస్థితి లేదని ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. రేపటి లోగా డిసెంబర్ నెల జీతాలు ఇస్తామని జనవరి నెల త్వరలో వస్తాయని చెప్పడంతో వాగ్వాదానికి దిగటం జరిగింది. రెండు నెలల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. డైరెక్టర్ కార్యాలయ అధికారులతో సిడిపిఓ అంజమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) నాయకులు గౌరమ్మ నాగమణి బాలమణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాందేవ్ రావు హాస్పిటల్ లో డెర్మాటలజీ, ఈ ఎన్ టీ ఉచిత క్యాంప్

- ఉచిత క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి... సీఈఓ డాక్టర్ యోబు



**కూకట్ పల్లి ఫిబ్రవరి 27 వెలుతురు:**
కూకట్ పల్లి రాందేవ్ రావు అస్పత్రి లో డాక్టర్ కమలాకర్ డైరెక్టర్ విక్రందేవ్ రావు, మీరా రావు, ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావు ల ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన ఉచిత డెర్మాటలజీ, ఈ ఎన్ టీ ఉచిత క్యాంప్ నిర్వహించనున్నట్లు ఈ ఉచిత క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు ఓ ప్రకటన లో తెలిపారు. మార్చి 2 వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. ఈ క్యాంప్ లో చెవి నొప్పి, వినికిడి నష్టం, చెవి నుంచి ద్రవం విడుదల, తల తిరగడం, ముక్కు మూసుకుపోవడం, ముక్కు నుండి రక్తం కారుట, ముక్కు నొప్పి, గొంతు నొప్పి, దగ్గు, చేదు శ్వాస, అలర్జీలకు వైద్య పరీక్షలు చేశారనన్నారు. ఈఎన్ టి సర్జన్స్ డాక్టర్. ఎస్ . శ్వేత, డాక్టర్ డి లావణ్య లు ఏ వైద్య శిభిరాన్ని పర్యవేక్షణ చేస్తారన్నారు. డాక్టర్ల సలహ మేరకు అవసరమైన వారికి సి టి స్కాన్ రూ. 1000, ఎం ఆర్ ఐ 2000 లకే చేస్తామన్నారు. అదేవిధంగా మొటిమలు, బొల్లి మచ్చలు, మంగు మచ్చలు, గజ్జి, తామర, ఇతర మచ్చలు, దురదలు, దద్దుర్లు, అలర్జీలు, జుట్టు రాలడం, బట్ట తల, చుండ్రు, పెను కొరకడం, గోరు చుట్లు ఇన్ఫెక్షన్ లకు కు కూడా పరీక్షలు చేయనున్నామన్నారు. వీటిని డాక్టర్ సి. స్వాతి డాక్టర్. కె. శ్రీహర్ష లు పర్యవేక్షిస్థారన్నారు. డాక్టర్ల సలహామేరకు సిబిపి, ఏఈసి, ఐజిఈ, ఎనిమియా ప్రొఫైల్, పి టీ ఏ, ఐ ఎం పి, ఓఏఈ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. వినికిడి పరికరాలు మీద ప్రత్యేక డిఎం క్యాంప్ ఉంటుందని డాక్టర్ యోబు తెలిపారు.

## ప్రశాంత వాతావరణం లో ఎమ్మెల్సీ ఎన్నికలు

- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు
- క్షేత్ర స్థాయిలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ , ఐపీఎస్.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 27**
రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ వ్యాప్తంగా పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 108 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందన్నారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ రామగుండం లోని ZPHS స్కూల్, గోదావరిఖని లోని సే క్రెడ్ హార్ట్ స్కూల్ మరియు మంచిర్యాల జోన్ పరిధిలో లక్షెట్టిపేట లోని ZPHS స్కూల్ పోలింగ్ కేంద్రాలను రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి క్షేత్ర స్థాయిలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికలు జరుగుతున్న తీరును పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..... పోలింగ్ కేంద్రాల వద్ద 163 BNSS సెక్షన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. కమీషనరేట్ వ్యాప్తంగా ప్రశాంతంగా జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. . ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది మొత్తం 560 మందితొ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఇలాంటి అవాంఛనియా లేకుండా ముందస్తు జాగ్రత్తలు, భద్రతా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయి రిసెప్షన్ సెంటర్ చేరేవరకు పటిష్టా భద్రత రోడ్డు బందోబస్తు వేయడం జరిగిందని తెలిపారు. సీపీ, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గొడవరిఖని ఏసీపీ రమేష్, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, ఆర్ఐ సంపత్, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, లక్షెట్టి పేట్ ఎస్ఐ లు ఉన్నారు.



## పెద్ద అంబర్ పేటలో బీహార్ వ్యక్తి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందుల్లో కుమార్ జేసీబీ కంపెనీ లో మెకానిక్ గా ఉద్యోగం



**వెలుతురు, పెద్ద అంబర్ పేట్, ఫిబ్రవరి 27:**
హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్ పేటలో బీహార్ కు చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో హత్మఆత్య చేసుకున్న ఘటన జరిగింది, బీహార్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన కుమార్ అనే వ్యక్తి పెద్ద అంబర్ పేట్ లోని జేసీబీ కంపెనీలో మెకానిక్ గా పనిచేస్తున్నాడు , అయితే అతను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా అతను నివాసం ఉంటున్న ఇంట్లో తనతో పాటు ఉంటున్న వ్యక్తులు నిద్రించిన తర్వాత కుమార్ ఉరి పోసుకొని ఆత్మ హత్య చేసుకొనట్లుగా తెలిసింది, తన తోటి ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సి ఎన్నికలు



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ తో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 73.26 శాతం, ఉపాధ్యాయ నియోజకవర్గం కు సంబంధించి 94.70 శాతం పోలింగ్ నమోదయ్యిందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఏ ఆర్ ఓ , ఆర్డీఓ పి. రాంరెడ్డి సందర్శించారు.

## నంది వాహనంపై శివపార్వతుల ఊరేగింపు





**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 27 :**
నారాయణఖేడ్ చారిత్రాత్మక కాశీనాథ్ ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం నంది వాహనంపై శివపార్వతుల ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ గురురాజ్ శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,శివ స్వాములు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శివపార్వతుల కళ్యాణ మహోత్స కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పురోహితులు గురునాథ్ శర్మ మాట్లాడుతూ శివరాత్రి రోజున జాగరణ చేస్తే బోలా శంకరుడి కటాక్షంతో అద్భుతమైన ఫలితాలు పొందవచ్చన్నారు. మానవుడు తన జీవిత కాలంలో ఒక్కసారైనా శివదీక్ష ధరించాలని చెప్పారు.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన మాజీ ఎంపీ బి బి పాటిల్....





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 27:**
సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ తో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 73.26 శాతం, ఉపాధ్యాయ నియోజకవర్గం కు సంబంధించి 94.70 శాతం పోలింగ్ నమోదయ్యిందని అధికారులు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మాజీ ఎంపీ బి బి పాటిల్, జిల్లా బీజేపీ పార్టీ అధ్యక్షురాలు గోదారి అంజి రెడ్డి ఎన్నికల పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారితోపాటు పట్టణ 2 బీజేపీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గొల్ల భాస్కర్, అప్పం శ్రవణ్, జీవన్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని పరిశీలించిన ఏమాజి





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 27**

ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటిసి ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొయ్యల ఏమాజి పరిశీలించారు. సిర్పూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని బెల్లంపల్లి, తాండూరు, కన్నేపల్లి, కాగజ్ నగర్, సిర్పూర్ తదితర మండలాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. మెజారిటీ ఓటర్లు బిజెపి వైపు మొగ్గు చూపారని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో స్థానిక ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు కేశవ్ రెడ్డి, పులగం తిరుపతి, గోవర్ధన్, శేషగిరి, చిరంజీవి, మహీధర గౌడ్, కమల, శీతల్, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన ఎం.ఎల్.సి. ఎన్నికల పోలింగ్

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 27**

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించి అధికారులు, సిబ్బంది పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్కాస్టింగ్ ద్వారా జిల్లాలో కొనసాగుతున్న పోలింగ్ సరళిని పర్యవేక్షించి, నస్పూర్ మండలం తీగల్పహాడ్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం 8 గం..ల నుండి సాయంత్రం 4 గం..ల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఇందు కొరకు జిల్లాలో 60 మంది ప్రిసైడింగ్ అధికారులు, 181 మంది పోలింగ్ అధికారులు, 25 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎం.ఎల్.సి. ఎన్నిక కొరకు 18 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నిక కొరకు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 8 కామన్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్, వెలుతురు, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకతను తెలుసుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. శిరీష, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ వర్సెస్ కాంగ్రెస్

**రాష్ట్రంలో బీసీ వర్గం బీసీ అభ్యర్థులను ఒడ్డుకు చేరుస్తుందా**

**ఈసారి హస్తానికి విలువనిస్తుంది**

## గెలుపు ఎవరిది



బీఎస్పీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 27**

మంచిర్యాల, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు బీసీ వర్సెస్ కాంగ్రెస్ గా మారింది ఒకరోజు వ్యవధిలోనే బిజెపి కనుమరుగయ్యే అవకాశం ఉందని ఓటర్లు చెబుతున్నారు. అయితే బీసీ వర్గం నుండి ఇప్పటివరకు ఒక్క ఎమ్మెల్సీ కూడా లేకపోవడంపై బీసీల్లో చైతన్యం వచ్చిందంటున్నారు ఓటర్ మహాశయులు. విజయానికి కొద్దిపాటి చేరువలో ప్రసన్న హరికృష్ణ వర్సెస్ నరేందర్ రెడ్డి ఉండే అవకాశాలు ఉన్నాయంటున్నారు. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పరిస్థితి ఏంటి? ఓట్లు చీలుస్తాడా విజయం వైపు పరుగులు తీస్తాడా..... పోలింగ్ శాతాలను బట్టి ప్రసన్న హరికృష్ణ లేక నరేందర్ రెడ్డి అత్యల్ప ఓట్ల మెజారిటీతో గెలిచే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

# సమస్యలపై అధికారులతో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సమావేశం




**వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 27:**

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో గత కొంతకాలంగా త్రాగునీటి సరఫరా సరిగ్గా రావడంలేదని కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం నాడు కాలనీ వాసులతో కలిసి జల మండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ కార్యాలయంలో కాలనీవాసుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డి మాట్లాడుతూ త్రాగునీటి సరఫరా సరిగ్గా రాకపోవడంతో తరచూ కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రానున్నది వేసవికాలం గనుక డివిజన్ త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన జనరల్ మేనేజర్ కు సూచించడం జరిగింది. ఈ సమావేశంలో రాఘవేంద్ర కాలనీ అధ్యక్షులు కోట రవీందర్ , కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు చిన్న ,హరినాథ్ బాబు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు,

## స్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



**వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 27:**

హయత్ నగర్ డివిజన్ పరిధిలో ఉన్న బంజారా కాలనీ ఏరియా లో ఉన్న హిందూ స్మశాన వాటిక లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం నాడు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగవంతం పెంచి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు నవ జీవన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్ ,ఏఈ హేము నాయక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ క్రీడల ప్రోత్సాహం



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్, ఫిబ్రవరి 27 :**

మహాశివరాత్రి సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి ఆధ్వర్యంలో గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించగా ప్రైజ్ లు గురువారం రోజున క్రీడాకారులకు పంపిణీలో మొదటి బహుమతిగా గెలుపొందిన వారు ఆర్ స్ ఫాలోవర్స్ వారికి రూ. 11,111/- పెద్దిగారి విగ్నేష్, ద్వితీయ బహుమతి గెలుపొందిన వివేకానంద యూత్ వారికి రు . 5,555/- పోలోజు అనిల్ షీల్డ్ కప్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా, మానసికంగా ఉల్లాసాన్ని కలగజేస్థాయని, ఇదేవిధంగా చదువులలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఉద్యోగాలు సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కు సహకరించిన దాతలు కొయ్యడ శేఖర్ గౌడ్ , గట్టు మొగలయ్య, కంచర్ల సాయిలు, బొల్లమోని శ్రీకాంత్ , వర్కాల శ్రీకాంత్, కొలుకులపల్లి రాజశేఖర్, రెడ్డమోని శివ గార్లు, వాలీబాల్ క్రీడాకారులు బొల్లమోని గణేష్ ,అన్నమోని వినయ్ , గట్టు సాయి ,గంగాపురం ప్రవీణ్, గట్టు సందీప్ ,భాను, పోలోజు శ్రవణ్, సిలివేరు చంద్రకాంత్ , రవి, శివ, శ్రీనివాస్, భాను తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి సందర్భంగా శాలివాహన సంఘం వద్ద పండ్ల పంపిణీ

**వెలుతురు, సంస్థాన్ నారాయణ పూర్, ఫిబ్రవరి 27:**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శాలివాహన సంఘం (కుమ్మరి )వీధిలో శ్రీరామ లింగేశ్వరాస్వామి ఆలయంలో భక్తులు శివ నామస్మరణతో మార్మోగింది, భక్తులు పోటెత్తారు,ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ప్రవేశం వద్ద అరుణ స్టీల్ ఫర్నిచర్ యాజమాన్యం చిలివేరు అంజయ్య-అరుణ దంపతులు మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పండ్లు పంపిణి చేశారు, ఈ కార్య క్రమంలో భక్తులతో పాటు దిశ దిన పత్రిక రంగారెడ్డి జిల్లా బ్యూరో ఇన్చార్జి చిలువేరు సురేష్ దంపతులతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు సైతం హాజరయ్యారు,



# యాదగిరిగుట్ట క్షేత్ర వైభవాన్ని చాటేలా ఘనంగా బ్రహ్మోత్సవాలు

- **దేవస్థానం ఈవో ఎ భాస్కర్ రావు**

**( పుట్ట హనుమంత్ ) వెలుతురు, యాదగిరిగుట్ట,ఫిబ్రవరి 27**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి మహత్యాన్ని తెలియజేసేలా, ఈ క్షేత్ర వైభవాన్ని నలుదిక్కులా చాటేలా అత్యంత ఘనంగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో ఎ భాస్కరరావు తెలిపారు. గురువారం యాదగిరిగుట్ట కొండపైన ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మార్చి 1వ తేదీ నుండి 11వ తేదీ వరకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని అన్నారు. ఇప్పటికే మంత్రులు ఉన్నతాధికారులు, వివిఐపీలు, వీఐపీలకు , ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు పంపించామని అన్నారు. ఇంకా ఎవరైనా వీఐపీలు మిగిలి ఉంటే వాళ్ళందరికీ కూడా ఆహ్వానాలు పంపిస్తున్నామని అన్నారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర గవర్నర్ ను కూడా ఆహ్వానించనున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టాలైన స్వామివారి ఎదుర్కోలు , స్వామివారి కళ్యాణ మహోత్సవం , రథోత్సవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. మార్చి 7వ తేదీ శుక్రవారం స్వామివారి ఎదుర్కోలు, 8వ తేదీ శనివారం రోజున స్వామి వారి కళ్యాణ మహోత్సవం , 9వ తేదీ ఆదివారం రోజున రాత్రి 8 గంటలకు స్వామివారి దివ్య విమాన రథోత్సవం జరగనుందని తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను మార్చి ఒకటో తేదీ నుండి పదవ తేదీ వరకు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకటవ తేదీ నుండి మూడో తేదీ వరకు సాయంత్రం 6 గంటల నుండి తొమ్మిది గంటల వరకు సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు చే నృసింహ వైభవం ఆధ్యాత్మిక ప్రవచనం ఏర్పాటు చేశామని చెప్పారు. అదేవిధంగా మార్చి నాలుగో తేదీన ప్రముఖ సినీ సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్ చే భక్తి సంగీత విభావరి , మార్చి 5వ తేదీన ప్రముఖ గాయని శ్రీమతి తేలు విజయ చే భక్తి సంగీత కార్యక్రమం , అదే విధంగా మార్చి ఆరవ తేదీన శాస్త్రీయ సంగీత విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ చే అన్నమాచార్య సంకీర్తన విభావరి, మార్చి ఏడవ తేదీన పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ చే భక్తి సంగీత విభావరి , మార్చి 9వ తేదీన సంగీత దర్శకులు రామాచార్యులు చే భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా లైవ్ మ్యూజిక్ షోను ఏర్పాటు చేశామని, ఇది ప్రత్యేక ఆకర్షణగా



నిలవనుందని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 1వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఎలాంటి టోల్ ఫీజు లేకుండా వాహనాలను కొండపైకి అనుమతించనున్నామని తెలియజేశారు . టూ వీలర్ ఫోర్ వీలర్ వాహనాలను కొండపైకి ఉచితంగా అనుమతించడం వల్ల సామాన్య భక్తులందరూ కొండపైకి చేరుకొని స్వామివారిని సులువుగా దర్శించుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. అదేవిధంగా కొండపైకి బస్సుల సౌకర్యాన్ని కూడా తగిన విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు సుమారు 2 వేల మంది వరకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇంకా ఎక్కువ మంది భక్తులు వచ్చినా వారందరికీ సరిపడేలా అన్నదానాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. భక్తులు పెద్ద ఎత్తున బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకోవాలని అన్నారు. ప్రతి సామాన్య భక్తుడికి స్వామివారి దర్శన భాగ్యం కల్పించడంతోపాటు, భక్తులంతా బ్రహ్మోత్సవాలను దగ్గరగా తిలకించే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. క్షేత్ర వైభవాన్ని స్వామివారి మహత్యాన్ని తెలియజేసేలా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అదేవిధంగా యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు పార్కింగ్ , మంచినీరు, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేకభద్రతా ఏర్పాట్లను నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు స్థానికులు భక్తులు ప్రతి ఒక్కరు సహకరించాలని ఈవో భాస్కరరావు కోరారు.

# ఉప్పరపల్లి గ్రామం - కేసముద్రం మండలం


- **ఫోటో గ్రాఫర్ బండారు శ్రీను గౌడ్ కు చిలువేరు సమ్మి గౌడ్ పరామర్శ..**



**కేసముద్రం వెలుతురు ఫిబ్రవరి 27:**

కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ బండారు శీనుకు ఇటీవల పక్షవాతం వచ్చి వరంగల్ హాస్పిటల్ నుండి తిరిగి ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు...అనంతరం వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, ఇకనుండి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఫిజియోథెరపీ ద్వారా త్వరగా కోలుకుంటావని, ఇక నుండి అన్ని విధాల మా యొక్క సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా కల్పించారు... ఈ కార్యక్రమంలో చీకటి కిరణ్,బండారు గోపి పబ్బతి సారంగం, మోరపాక యాకయ్య, రేగుల వెంకటరమణ, ఎసల్ల సత్యనారాయణ, చాగంటి శ్రీను,కొండేటి కళాధర్,పబ్బతి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తాటి రామచంద్రం ప్రథమ వర్ధంతి



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్, ఫిబ్రవరి 27 :**

చౌటుప్పల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తాటి రామచంద్రం ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామచంద్రం కాంగ్రెస్ పార్టీ ఎనలేని సేవ చేసినారు, జిల్లా ఉపాధ్యక్షులుగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా పనిచేస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేసినారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ స్మారక ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ M.A.ఖయ్యూం , నాయకులు ఐన్ టియుసి జిల్లా అధ్యక్షులు సామకూర రాజయ్య, నల్ల నరసింహ, వర్కల రవి, ఎండి చాంద్ పాషా, ముత్యాల గణేశ, బొడిగ బాలకృష్ణ, ఉదారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు .

## పులి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని ఉపాధ్యాయులను కోరిన బిజెపి నాయకులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 27:**
మండలం 139 వ బూతులో బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పులి సర్వోత్తమ్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో, గెలిపించాలని ఉపాధ్యాయులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నకిరేకల్ అసెంబ్లీ ఇంచార్జ్ స్టేట్ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య. జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ , జిల్లా కార్యవర్గ సభ్యులు దావునూరి వెంకటేష్ . బిజెపి సీనియర్ నాయకులు యానాల శంకర్ రెడ్డి, మాదూరి ప్రభాకర్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లపు దుర్గయ్య నోముల శ్రీను , సీనా రెడ్డి ,ముత్యాల స్వామి, జెల్ల లక్ష్మీనారాయణ, గన్నెబోయిన మధు ,బెల్లి లింగస్వామి, సనగొండ మల్లికార్జున చారి, బట్టే రమేష్, ఏనూతుల సురేష్, బందెల సంజీవ, రేపాక లింగస్వామి, బాత్క నరేష్, బాణాల దామోదర్ రెడ్డి, బోయపల్లి ప్రవీణ్ ,నల్లబోతు మధు, వీరమల్ల గణేష్, జంగిలి సత్యనారాయణ, జంగిలి కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్






**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 27:**
టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా నల్లగొండ ఖమ్మం వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ లో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ నెంబర్ 138 లో గల మొత్తం 50 మంది ఓటర్లు .35 మంది పురుష ఓటర్లు,14 మంది మహిళా ఓటర్లు పోలింగ్ లో పాల్గొన్నారు. ఈ పోలింగ్ స్టేషన్ పరిధిలో 98 శాతం పోలింగ్ నమోదు అయినట్లుగా ఎన్నికల అధికారులు తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డికి మద్దతుగా బీజేపీ శ్రేణులు అనుబంధ సంఘాల నాయకులు వచ్చారు. యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి కి మద్దతుగా కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు వచ్చారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు



**చింతపల్లి, వెలుతురు ఫిబ్రవరి 27**
వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ ఎన్నికలు ముగిసింది ప్రశాంతంగా ముగిసింది... చింతపల్లి మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి అని తహసీల్దార్ రమాకాంత్ శర్మ అన్నారు,మొత్తం ఓట్లు 87, పురుషులు 46 , స్త్రీలు 40, మొత్తం పోలైన ఓట్లు:86బీ పోల్ చేయబడినవి ఓటింగ్ శాతం 98.85% నమోదయిందని తెలిపారు, బ్యాలెట్ బాక్స్ ల ను నల్లగొండకు తరలిస్తున్నారు, ఎస్సై బి యాదయ్య, ఆర్ ఐ సునీత, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఉన్నారు.

## గార్లపాటి రాములు మృతి బిఆర్ఎస్ పార్టీ కి తీరని లోటు

- బిఆర్ఎస్ పార్టీ చింతపల్లి మండల సహాయ కార్యదర్శి దండేటికార్ ప్రసాద్

**చింతపల్లి వెలుతురు ఫిబ్రవరి 27**



చింతపల్లి మండలం వింజమూరు గ్రమానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గార్లపాటి రాములు మృతి బిఆర్ఎస్ పార్టీ కి తీరని లోటు అని బిఆర్ఎస్ పార్టీ చింతపల్లి మండల సహాయ కార్యదర్శి దండేటికార్ ప్రసాద్ అన్నారు. గురువారం రోజున వింజమూరు గ్రామంలో గార్లపాటి రాములు మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ పార్టీ చింతపల్లి మండల సహాయ కార్యదర్శి దండేటికార్ ప్రసాద్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గార్లపాటి రాములు మృతి బాధాకరం అని ఆయన అన్నారు. వారి కుమారుడు గార్లపాటి రవిచంద్ర గారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట నాగిళ్ల బాలయ్య ఆరెకంటి పాపయ్య ఆరెకంటి జంగయ్య ఆరెకటి రామకృష్ణ ఆరెకంటి రాధాక్రిష్ణ, ఆరెకంటి భార్గవ్ అరేకంటి మురళీ, ఆరెకంటి విజయ్, కర్నాటి లక్ష్మయ్య పందుల సత్తయ్య ఆరెకంటి శ్రీను ఆరెకంటి యాదగిరి గార్లపాటి జగన్ కోట మరి బాబు కర్నాటి శంకర్ ఆరెకంటి పృథ్వీరాజ్ ఆరెకంటి అంజి కర్నాటి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ భూములను దళితులకు పంచాలి

- దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి.
- డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్.

**వలిగొండ వెలుతురు ఫిబ్రవరి 27:**




ప్రభుత్వ మిగులు భూములను దళితులకు పంచాలి. దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలు, హత్యలు, హత్యాచారాలను అరికట్టాలని,దళితుల హక్కుల కోసం పటిష్ఠంగా తీసుకువచ్చిన అనేక చట్టాలు అమలు కాకుండా దళితుల జీవితాలు దుబ్బరంగా ఉన్నాయని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. గురువారం నాడు వలిగొండ మండల కేంద్రములో దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) జిల్లా సమావేశం కచపాక దయాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం కు సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు హాజరైనారు. ముఖ్య అథిదిగావిచ్చేసిన మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా దళితులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో దళితులకు సాగుభూమి నివాసయోగ్యమైన భూములను ఇస్తామని వాగ్దానం చేసింది. దాని అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన కోరారు. బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన హక్కులు, ఆవకాశాలను బిక్షగా కాకుండా హక్కుగా ప్రభుత్వాలు, అధికారులు అమలు చేసే విధంగా డి హెచ్ పి ఎస్ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలన్నారు. దళితులు మంచి దుస్తులు తోడుక్కున్న, తినే తిండి మీదా ఆంక్షలు పెడుతూ, పెండ్లిచేసుకోని గుర్రపు బండిపై ఉరేగిన దాడులు చేస్తూ, దళిత విద్యార్థులు బుల్లేట్ బండి నడిపిన చేతులు నరుకుతున్న సమాజంలో ఉన్నందుకు సిగ్గుతో తలదించుకోవాలని,పాలు తాగే పసి పాపనుండి పండు ముసలి వరకు వదలకుండా హత్యాచారాలు జరుగుతున్న చోద్యం చూస్తున్న యాత్రాంగాన్ని చూస్తే చాల దారుణమన్నారు. విద్యకు బడ్జెట్లో 20 శాతం నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. గృహ జ్యోతిలో 200 యూనిట్లలో భాగంగా దళితులకు జీరో బిల్లు గ్రామాలలో రాని కుటుంబాలు చాల వరకు ఉన్నాయన్నారు. బిల్లులు కట్టాలని విద్యుత్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే అన్ లైన్ ఆప్షన్ లో డాట ఏంట్రి చేసి జీరో బిల్లు వచ్చే విధంగా అధికారులు చోరవచూపాలన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించి కూలీలందరికి పనులను కల్పించాలన్నారు. దళితుల భూములను అప్పనంగా కాజేస్తున్న భూ భకాసురులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, డిహెచ్పి ఎస్ జిల్లా నాయకులు కట్ల యాదగిరి, ఇంజ హేమలత, కొమ్ము బాల నరసింహా, వీసం గాలయ్య, ఇంజ శ్రీనివాస్, సలిగంజి నరసింహా, రుద్ర పెల్లి శ్రీనివాస్, యుగంధర్, నరసింహా, సుగుణ, తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన ప్రాచీన శివాలయ ఉత్సవాలు

- రథోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి
- రాచకొండ ప్రాంతంలో అనేక ప్రాచీన ఆలయాలు ఉన్నాయా.
- హిందువులకు మహా శివరాత్రి అత్యంత పవిత్రమైనది.
- హిందువులు ఇతర మత ఉత్సవాలకు దూరంగా ఉండాలి.

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 27:**



మహాశివరాత్రి పండుగ సందర్భంగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రాచీన శివాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతి పరమేశ్వర ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని రాచకొండ ప్రాంతానికి కొన్ని వేల సంవత్సరాల చరిత్ర ఉన్నదని,ఈ రాచకొండ ప్రాంతం ఒకానొకప్పుడు శివనామస్మరణలతో మారుమోగిన ప్రాంతమని ఇటువంటి ఈ పుణ్యభూమిలో మనం జన్మించడం మన పూర్వజన సుకృతమని ఆయన అన్నారు,ఇంత పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక ప్రాంతంలో మన హిందూ దేవాలయాల మీద అనేక దాడులు జరిగాయని, మన హిందూ సంస్కృతి సాంప్రదాయాల మీద,హిందూ పండగల మీద అనేక రకాలుగా ఆ దాడులు నేటికీ జరుగుతూనే ఉన్నాయని, ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మహాశివరాత్రి పర్వదినం నాడే రాచకొండలో ఉర్సు పేరుతో ఉత్సవాలు నిర్వహించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా హిందూ భక్తులందరూ మహాశివరాత్రి పర్వదినాన మనం ఉపవాస దీక్షలు చేసి,ఎంతో భక్తి శ్రద్దలతో పరమ పవిత్రంగా పూజించుకునే మన హిదూ బంధువులందరు శివాలయాలకు మాత్రమే వెళ్లాలని అన్యమతస్తుల ప్రార్ధనాస్థలాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కల్యాణము, సాంస్కృతిక కార్యక్రమాలను ఏటేటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులందరినీ అభినందించారు, తదనంతరం ఆలయ కమిటీ సభ్యులు మనోహర్ రెడ్డి గారిని శాలువాతో సన్మానించడం జరిగింది . భక్తులకు ఆలయ ఉపాధ్యక్షుడు సాధు వెంకన్న గుప్త కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్ల సతీష్ గౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు వెంకటాచారి,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర నరసింహ గౌడ్,వీరమల్ల కేశవులు,పాలకుర్ల గిరి గౌడ్,జిల్లా నాయకులు జక్కర్తి బిక్షం, శివాలయం కమిటీ గౌరవ అధ్యక్షులు పల్లె గోపాల్ రెడ్డి, పాలకుర్ల యాదగిరి గౌడ్, పాలకుర్ల యాదయ్య, వీరమల్ల కేశవులు ఉపాధ్యక్షులు, సాదు వెంకన్న, సురకంటి జనార్ధన్ రెడ్డి, పట్నం రాములు, ప్రధాన కార్యదర్శి సూరపల్లి జవహర్, సహాయ కార్యదర్శి సోమనబోయిన కృష్ణ కుమార్ యాదవ్, సురచిన్న రాజయ్య,



కోశాధికారి దూసరి శ్రీనివాస్ గౌడ్, ప్రచార కార్యదర్శి గొల్లూరి శ్రీశైలం కమిటీ సభ్యులు పాశం కృష్ణ యాదవ్, పాలకొర్ల వెంకటేశం, బద్దం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కుల మతాలకు అతీతంగా రాచకొండ ఉత్సవాలు

- ఉప్పల లింగస్వామి

**ఉప్పల ను సన్మానించిన రాచకొండ రాచప్ప సమితి**



**వెలుతురు, సం స్థాన్ నారాయణ పూర్, ఫిబ్రవరి 27:**
రాచప్ప సమితి రాచకొండ యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థాన్ నారాయణపూర్ మండలం రాచకొండ పర్యాటక ఉత్సవాలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా భక్తుల కోసం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి మాట్లాడుతూ రాచకొండ పర్యాటక ఉత్సవాలు, ఉర్సు ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకోవడం సంతోషం అని అన్నారు,సందర్భంగా శాలువాతో ఉప్పల లింగస్వామి ని రాచకొండ రాచప్ప సమితి సన్మానించారు, ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బద్దుల కృష్ణ కుమార్ యాదవ్ తో పాటు యాదాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, మైనార్టీ నాయకులు ఎండి రహీమ్ షరీఫ్, నారాయణపురం మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, చిలువేరుఅంజయ్య(పాల ),గునిగంటి రాజు గౌడ్, అచ్చిని ప్రవీణ్, మారగొని శంకర్ గౌడ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

# తెలంగాణ ప్రాజెక్టుల బాధ్యత కిషన్ రెడ్డిదే

***రాష్ట్ర ప్రాజెక్టులపై అనేకమార్లు కేంద్రానికి నివేదించాం***

***గత పదేళ్లలో కాలయాపన చేసిన బిఆర్ఎస్***

***మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు***

**సిద్దిపేట,ఫిబ్రవరి27( వెలుతురు):**
తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న తమ నాయకుడిని బీఆర్ఎస్ పార్టీ సంప్రదించలేదని రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదని.. ప్రధాని వస్తే కేసీఆర్ కలవడంలేదని ఏదేదో చెప్పి కాలం గడిపారని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని చాలాసార్లు కలిసి అడిగామని గుర్తుచేశారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అనే సంబంధాల దృష్ట్యా రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం హుస్నాబాద్ టౌన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్రానికి రావాల్సిన ఏ ప్రాజెక్టు రాకపోయినా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటి వరకు మెట్రో మలిదశ , మూసీ, ఓఆర్ఓఆర్, ట్రిపుల్ ఆర్ , హైదరాబాద్ తాగునీటి సమస్య ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఉపాధి అవకాశాలు మెరుగుపడే అంశాలకు సంబంధించి అనేకమైన ప్రాజెక్టులు కేంద్రానికి సమర్పించామని తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలు నెరవేర్చాల్సి ఉందని అన్నారు. కిషన్ రెడ్డి రాష్ట్రానికి నిధులు తేకపోతే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ వేరు కాదని గమనించాల్సి వస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అని ముందు నుంచి చెబుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా తీసుకున్న కుల సర్వేపై మొదటి వారంలో శాసన సభలో చట్టం చేసి రాజకీయ విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేసే తీర్మానాన్ని చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రం ఎప్పుడైతే ఈబీసీకి సంబంధించి షెడ్యూల్లో మార్చుకున్నారో అదేవిధంగా దీనిని కూడా దాని మాదిరిగానే మార్చాల్సిందేనని.. రాజకీయ కారణం చూపిస్తే సరిపోదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గుజరాత్‌లో ప్రధాని మోదీ స్టేట్మెంట్ ఉంది దాని మాదిరిగానే రిజర్వేషన్లు ఇస్తున్నామని అన్నారు. కొంతమంది నేతలు తప్పుడు ప్రచారాలు చేసి మత పరమైన పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ - ఇండియా అంటూ నేతలు రెచ్చగొడుతున్నాని ధ్వజమెత్తారు. తమకు తెలంగాణ ప్రయోజనాలు ప్రజల అభివృద్ధి ముఖ్యమని స్పష్టం చేశారు. తమిళనాడులోఎన్ని రాజకీయ విభేదాలు ఉన్న అభివృద్ధి ప్రయోజనాలు విషయంలో అందరూ ఒక్క మాట మీదనే ఉంటారని చెప్పారు. తెలంగాణకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలో ఉన్న బీజేపీ కలిసి వచ్చి పెద్దన్న పాత్ర పోషించి నిధులు కేటాయించే ప్రయత్నం చేయాలని కోరారు. అది కేంద్ర ప్రభుత్వం బాధ్యతని.. లేదంటే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ మాటలు వింటే నవ్వువస్తోందని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓడిపోతే ట్వీట్ చేస్తున్నారు.. పంటలు ఎండిపోతే ట్వీట్ చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం తాగు, సాగు నీటికి చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు

- ఎస్ఎల్బీసీ వద్ద ఇంకా వీడని ఉత్కంఠ



**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి27( వెలుతురు):**
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియ షురూ అయింది. గురువారం నాడు సహాయక చర్యల్లో భాగంగా ఒక వైపు డీ వాటరింగ్ చేస్తూ, మరో వైపు బురదను లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకువస్తున్నారు. టీబిఎం మిషన్ సమీపంలో పడి ఉన్న సామాగ్రిని కూడా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే తప్ప సహాయక చర్యలు చేపట్టే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బురద తొలగించే పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నారు. సొరంగం నుంచి పెద్ద ఎత్తున బురద బయటకు తీస్తున్నారు. లోకో ట్రైన్ వెళ్లి రావడానికి గంట సమయం పడుతుంది. పెద్ద ఎత్తున కూలీలను ఉపయోగించి.. లోపల హిట్యాచి ద్వారా బురదను బయటికి తకలిస్తున్నారు. భారీ యంత్రం సహాయంతో వీటిని తీసి టిప్పర్‌లలో తరలిస్తున్నారు. ఈరోజు మొత్తం ఇదే కార్యక్రమం సాగుతుందని.. బురద తీసాక పరిస్థితిని అంచనా వేసి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ఎలా అనేదానిపై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తామని చెబుతున్నారు. ఒక వైపు బురద తొలగిస్తూనే మరో వైపు టీబిఎం మిషన్‌ను చిన్న చిన్న బాగాలుగా కట్ చేస్తున్నారు. ఈ భాగాలను కూడా వేరుచేసి బయటకు తీస్తున్నారు. ముందుగా రెండుకిలోమీటర్ల వద్ద బురదను క్లియర్ చేస్తున్నారు.

# ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లనీయకుండా హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు

- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ కార్యకర్తలు



**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి27( వెలుతురు):**
ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు వద్దకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు పలువురు నేతలు చేరుకున్నారు. అయితే సొరంగంలోకి వెళ్లనీయకుండా హరీశ్‌రావు బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హరీశ్‌రావు, ఇతర నాయకులు రోడ్డుపైనే బైఠాయించిన నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై హరీశ్‌రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనను పరిశీలించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ నుంచి గురువారం బయల్దేరిన సంగతి తెలిసిందే. కల్వకుర్తిలో బీఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్‌రావు టీ తాగారు. అనంతరం అక్కడ్నుంచి నేరుగా ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు చేరుకున్నప్పటికీ.. లోపలికి పోలీసులు అనుమతించడం లేదు. భారీగా పోలీసులు మోహరించారు. మీడియాపై కూడా పోలీసులు ఆంక్షలు విధించారు.

# నోరుంది కదాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా ?

- పోసాని గతంలో ఆడబిడ్డలపైనా అనుచిత పోస్టులు
- బియ్యం కుంభకోణం నుంచి పేర్ని నాని తప్పించుకోలేడు
- మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

**మచిలీపట్నం,ఫిబ్రవరి27 ( వెలుతురు):**
చట్టబద్ధంగానే పోసాని కృష్ణమురళి అరెస్ట్ జరిగిందని, గతంలో ఆయన మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలు ఎవరూ మరచిపోరని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఇలానే ఉంటుందన్నారు. ఆడబిడ్డలపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ క్షమించమని.. ఆడబిడ్డల సంరక్షణ, సమాజ శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. సినీ రచయిత, నటుడు, వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణ మురళీ అరెస్టు పై స్పందించిన ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ.. అధర్మంగా, దుర్మార్గంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరినీ ధర్మం శిక్షిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లను పోసాని ఇష్టం వచ్చినట్టు మాట్లాడి దూషించాడని, ఇంట్లో ఉన్న ఆడ బిడ్డల గురించి కూడా చాలా అసహ్యంగా మాట్లాడాడని మంత్రి మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ ఉపేక్షించమని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు రక్షణ కల్పించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయాలనుకుంటే అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అందరినీ లోనికి పంపించేవాళ్లమని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధం గానే కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. వైసీపీ నేతలు చేసిన పాపాలే వాళ్లని వెంటాడు తున్నాయని, కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా, ఆనందంగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని, పెన్షన్ సొమ్ము పెంచి ఇస్తున్నామని తెలిపారు. దీపం పథకం కింద అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామని తెలిపారు. మే నెలలో తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ లకు నిధులు తెచ్చి పనులు ప్రారంభించామని.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి నిధులు, పెట్టుబడులు తెస్తున్నామని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో రాష్ట్రం అతివేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలవనుందని అన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని మీద మంత్రి కొల్లు రవీంద్ర ఘాటు వ్యాఖ్యలు చేశారు. పేర్ని నాని చాలా ఫ్రెస్టేషన్‌లో ఉన్నారని, తన గోడౌన్ నుండి రేషన్ బియ్యం ఏ రకంగా తరలి వెళ్లిందో, ఎక్కడి నుంచి ఏ లారీ బయల్దేరిందో చెక్‌పోస్ట్ నుంచి ఏ లారీ దాటిందో అన్నీ బయటకు వస్తాయని అన్నారు. కాకినాడ షిప్పుల్లో అక్రమంగా బియ్యం ఎలా రవాణా అయ్యిందో వివరాలన్నీ ఉన్నాయని మంత్రి తెలిపారు. పేర్ని నాని అకౌంట్‌లో డబ్బులు ఏ విధంగా వచ్చాయి.. ఆయన భార్య జయసుధ అకౌంట్‌లో డబ్బులు ఎలా క్రెడిట్ అయ్యాయో ఇలా అన్నీ బయటకు వస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# ఎస్ఎల్‌బీసీ ఘటనపై సీఎం బాధ్యతారాహిత్యం

- సహాయక చర్యల్లో ఘోరంగా వైఫల్యం
- ప్రచారాల మీద ఉన్న శ్రద్ధ.... ప్రాణాల మీద లేదు
- హెలికాప్టర్ షోలకే సీఎం పరిమితం?

: మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్,ఫిబ్రవరి27( వెలుతురు):**
ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లే ముందు హైదరాబాద్ హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సాధించడంలో కూడా ప్రభుత్వం ఫెయిల్ అయిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ బృందాలు, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు, ఏజెన్సీ మధ్య సమన్వయం లోపించినట్టు కనిపిస్తుందన్నారు. వీరికి డైరెక్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు అక్కడికి వెళ్లి హెలికాప్టర్లలో టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు తప్ప, సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. పైనుంచి హెలికాప్టర్‌లో చూస్తే సొరంగం లోపల ఏమన్నా కనిపిస్తాదా, ప్రత్యేకంగా చూడడానికి వీఎక్స్ రే కెమెరాలు ఉన్నాయా? హెలికాప్టర్లలో చెక్కర్లు కొట్టుడు టీవీ ఇంటర్వ్యూలు ఏమిటో నాకు అర్థం కావడం లేదని తెలిపారు. వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషం కూడా చాలా ముఖ్యమైనదని.. క్షణం కూడా చాలా విలువైనదని తెలిపారు. సొరంగం లోపల ఆహారం లేక తాగునీరు లేక చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ప్రాణాల మీద రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధ కరువైందేమోనని అనిపిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారం ముఖ్యమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కనీసం అక్కడికి వెళ్లి, ఒక డైరెక్షన్ ఇవ్వడంలో రేవంత్ రెడ్డి, నీటి పారుదల మంత్రి పూర్తిగా ఫెయిలయ్యారని ఆరోపించారు. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, ఇతరుల మీద నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# తీయని మాటలతో సైబర్‌నేరగాళ్ల బురిడీ

- అమాయకులను దోచుకుంటున్న సైబర్‌నేరగాళ్లు
- ఓ వ్యక్తి నుంచి రూ. 17 లక్షలు కాజేసిన వైనం

**హైదరాబాద్,ఫిబ్రవరి27( వెలుతురు):**
సైబర్ నేరగాళ్లు రోజుకో పంథాను ఎంచుకుంటున్నారు. అమాయకులను ఫోన్లు చేసిన మొదట తీయని మాటలతో వారిని మభ్యపెడుతున్నారు. తీరా వారి మాటలను నమ్మిన తరువాత వారికి కావాల్సిన వివరాలు తెలుసుకొని నగదును కాజేస్తున్నారు. తాజాగా తెలుగులో మాట్లాడి సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి నుంచి 17 లక్షలు గుంజేశారు. తెలుగులో మాట్లాడే వ్యక్తి నుంచి బాధితుడికి ఫోన్ కాల్ వచ్చింది. మోసగాడు తెలుగులో మాట్లాడటం వల్ల అవతలి వ్యక్తి చెప్పేది నిజమే అనుకున్నారు. మంచి ఆఫర్ దొరికిందని సంబరపడ్డాడు. సాధారణంగా చీటర్స్ తెలుగు సరిగ్గా మాట్లాడరు కదా మాయలో పడ్డాడు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ కేసును పరిశీలించి, మోసగాళ్లు వాయిస్ ట్రాన్స్‌లేటర్ ఉపయోగించి మోసం చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. డిసెంబర్‌లో, 31 ఏళ్ల బాధితుడికి ఫేస్‌బుక్‌లో ఒక ఫ్రెండ్ రిక్వెస్ట్ రావడంతో.. దాన్ని యాక్సెప్ట్ చేశాడు. ఆ తర్వాత మోసగాడు వాట్సాప్‌కు వచ్చి తనను "టాన్యా"గా పరిచయం చేసుకున్నాడు. ఫ్లిఫ్‌కార్ట్, కుకాయిన్ వంటి బ్రాండ్‌లను ప్రమోట్ చేసే పార్ట్-టైమ్ ఉద్యోగ అవకాశాన్ని వివరించాడు. వాటిని లైక్ చేయడం, చెల్లింపులు చేయడం వంటి పనులను చేసి కమీషన్‌తో రిఫండ్ అందుకోవచ్చని నమ్మించాడు. దీంతో మొదట చిన్న మొత్తాల్లో చెల్లింపులు చేసి రిఫండ్ అందుకున్న బాధితుడు, నమ్మకం పెరిగాక పెద్ద మొత్తాలు చెల్లించసాగాడు. చివరికి అతను 17 లక్షల రుపాయలు కోల్పోయాడు. ఎవరు ఫోన్ కాల్స్ చేసినా ఈ తరహా ఆఫర్లు, టాస్కులు ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. ప్రతి రోజు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ అనుకోని పరిస్థితులలో డబ్బులు చెల్లిస్తే వెంటనే 1930కు కాల్స్ చేసి ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.



# అక్రమాలకు తెగించిన అధికార టిడిపి

- స్వతంత్ర అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు విమర్శలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ప్రత్తిపాటి



**గుంటూరు,ఫిబ్రవరి27( వెలుతురు):**
కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు తెగబడిందని స్వతంత్ర అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ' ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలోని దుర్గి, బెల్లంకొండతో పాటు మరికొన్ని మండలాల్లోని కొన్ని బూత్‌లలో మా ఏజెంట్లను బయటకు పంపారు. ఇదేమి న్యాయం అని అడిగితే సమాధానం లేదన్నారు. మీకు చేతనైతే తలపడండి.. అంతేగాని, ఏజెంట్లను అలా బయటకు పంపడం ఏంటన్నారు. తెనాలిలో మున్సిపల్ హైస్కూల్‌లోని ఏడు బూత్‌లలో కోగంటి శివయ్య అనే వ్యక్తి పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నం చేసారు. మంగళగిరిలో కూడా ఆ విధంగానే జరుగుతోంది. అధికార పార్టీ వాళ్లు గేటు దాకా వచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. మేము ప్రచారం చేసుకోకూడదా అని నిలదీసారు. వీటన్నింటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు వెల్లడించారు. ప్రజల మద్దతు, గ్రాడ్యుయేట్‌ల మద్దతు పొందండి. వారి మద్దతు పొందలేకపోవడంతో జావగారిపోయి ఇలాంటి పద్ధతులకు పాల్పడుతున్నారు. వీటిని మేం ఖండిస్తున్నాం. అధికార పార్టీ పాల్పడుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులపై ఎన్నికల సంఘం అధికారి వివేక్ యాదవ్‌కి, ఆర్వో, జిల్లా కలెక్టర్, ఎస్పి లకు కూడా ఫిర్యాదు చేశాం. రాబోయే మూడు నాలుగు గంటల్లో ఎన్నికలు క్రమపద్ధతిలో నిర్వహించాలని మేం డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇదిలావుంటే ఎంఎల్ సి ఎన్నికల సందర్భంగా ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు కూటమి నేతలు చేరుకున్నారు. చిలకలూరిపేటలో ఆర్వీఎస్ సీబీఎస్ హైస్కూల్లోని పోలింగ్ బూత్ లను శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించి అనంతరం ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యేలా శ్రద్ధ వహించాలని కార్యకర్తలకు సూచనలు చేశారు.

# భవన నిర్మాణాలకు మార్గదర్శకాలు జారీ

**అమరావతి,ఫిబ్రవరి27( వెలుతురు):**
రాష్ట్రంలో అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి పురపాలకశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈమేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌పై భవన యజమానుల వద్ద అండర్ టేకింగ్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలి. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్లాన్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలి. డీవియేషన్ సరిచేసే వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వొద్దు. డీవియేషన్ ఉన్న నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు తప్పవు. నివాసయోగ్య ధ్రువపత్రం ఇస్తేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్స్‌లు జారీ చేయొద్దన స్పష్టం చేశారు. జోనల్ ప్లాన్‌లోనూ డీవియోషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలి. నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు.

# శరవేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

- కేంద్రమంత్రి రామమోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ



**విజయనగరం,ఫిబ్రవరి27( వెలుతురు):**
రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన సూచనలు చేస్తున్నారు. సిఎం చంద్రబాబు కూడా త్వరగా దీనిని పూర్తి చేసేలా ఆదేశ్వాలు ఇస్తున్నారు. మొదటి విడత కింద రూ.4,650 కోట్లతో జీఎమ్మార్ సంస్థ ఈ పనులు చేపట్టింది. 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని ఆ సంస్థ ప్రకటించినా, జనవరి నాటికే పూర్తి చేయించాలన్న సంకల్పంతో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోంది. ఎన్‌హెచ్16 నుంచి విమానాశ్రయం వరకు అనుసంధాన రహదారికి భోగాపురం మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో 60.08 ఎకరాలు సేకరించారు. ఇందులో 20.22 ఎకరాలకు పరిహారం చెల్లించారు. సవరవిల్లి పరిధిలో 39.86 ఎకరాలకు సంబంధించి 45 మందికి చెల్లించాల్సిన రూ.19.89 కోట్ల పరిహారాన్ని న్యాయస్థానంలో డిపాజిట్ చేశారు. ప్రత్యామ్నాయ రోడ్లకు రావాడ, కవులువాడల్లో 3.13 ఎకరాల తీసుకుని 0.78 ఎకరాలకు రూ.47.84 లక్షలు చెల్లించారు. రూ.3.19 కోట్లు చెల్లించాల్సి ఉంది. ముంజేరు వద్ద ల్యాండ్ పార్శిల్-1 వరకు రోడ్డు నిర్మాణానికి 1.11 ఎకరాలను గత నెలలో రైతులు అప్పగించగా, వారికి రూ.71.25 లక్షల పరిహారం చెల్లించాలి. బసవపాలెం వద్ద విమానాశ్రయం సిబ్బంది నివాస గృహ సముదాయం నిర్మాణానికి 24.30 ఎకరాలు గుర్తించారు. మరోవైపు 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణానికి 4.50 ఎకరాలు సేకరించగా, అందుకోసం ప్రభుత్వం రూ.70.21 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయం వరకు ట్రంపెట్ నిర్మాణానికి 19.75 ఎకరాలు సేకరించారు. వాటికి పరిహారంగా రూ.14.43 కోట్ల మేర ప్రభుత్వం చెల్లించనుంది. మరికొంత భూమికి రూ.22 కోట్లు అవసరం. ఫేజ్-1లో మార్చి తొలి వారం నుంచి రోజూ 1.7 ఎంల్‌డీల నీటి సరఫరాకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తి చేసింది. ఫేజ్-2లో 3.3 ఎల్ఎండీలు అవసరమని జీఎమ్మార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరాకు ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా పనుల వేగంతో అనుకున్న సమయానికన్నాముందే విమనాశ్రయం అందుబాటులోకి రానుంది. దీంతో ఉత్తరాంధ్ర గతి మారుతుందని భావిస్తున్నారు.

# ఓబులవారిపల్లె పీఎస్‌కు పోసాని తరలింపు

- అక్కడే వైద్య పరీక్షలు చేసిన ప్రభుత్వ వైద్యుడు



మదనపల్లె,ఫిబ్రవరి27( వెలుతురు):
వైకాపా (జాఖీఅఖ) నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళి ని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పీఎస్‌కు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో మైహోమ్ భూజాలో అదుపులోకి తీసుకున్న తర్వాత నేరుగా ఇక్కడికి తీసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్‌లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేశ్ ఆధ్వర్యంలో పోసానికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు నమోదు చేశారు. పోసాని కృష్ణమురళినిరైల్వేకోడూరు కోర్టులో హాజరు పరిచే అవకాశముంది. సినీ పరిశ్రమలో వర్గవిభేదాలు తలెత్తేలా, ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారి పల్లె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభియోగాలపై బీఎన్ఎస్‌లోని 196, 353(2), 111 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది. దీనిలోనే పోలీసులు పోసానిని అరెస్టు చేశారు. వైకాపా హయాంలో నాటి ప్రభుత్వ పెద్దల అండదండలు, ఆదేశాలతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ సహా నాటి ప్రతిపక్షంలోని ముఖ్యులు, వారి కుటుంబాల్లోని మహిళలపై అసభ్య పదజాలం, బూతులతో పోసాని కృష్ణమురళి పేట్రేగిపోయారు.

# పోసాని అరెస్ట్ నిరంకుశ విధానం

- తీవ్రంగా ఖండించిన వైకాపా అధినేత జగన్



అమరావతి,ఫిబ్రవరి27( వెలుతురు):
సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్టును వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఖండించారు. ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోందని మండిపడ్డారు. అరెస్ట్ నేపథ్యంలో పోసాని భార్య కుసుమలతను జగన్ ఫోన్‌లో పరామర్శించారు. అరెస్ట్ విషయంలో పోసానికి వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారని.. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. 'ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోంది. అరెస్ట్ విషయంలో పోసాని కృష్ణమురళికి వైసీపీ అండగా ఉంటుంది. రాష్ట్రంలో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారు. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలి. పోసానికి వైసీపీ పార్టీ తరుపున న్యాయ పరంగా సహాయం అందిస్తాం. పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులతో లీగల్ గా ముందుకు వెళ్తామని వైఎస్ జగన్ పేర్కొన్నారు. పోసాని కృష్ణమురళిని ఏపీ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. ప్రస్తుతం పోసాని అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్లో ఉన్నారు. ఓబులవారిపల్లి పీహెచ్సీ డాక్టర్ గురు మహేష్ ఆయనకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి ఫిర్యాదు మేరకు పోసానిపై కేసు నమోదైంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్, టీడీపీ నేత నారా లోకేశ్‌లు.. వారి కుటుంబ సభ్యులను అసభ్యంగా దూషించినందుకు పోసానిపై కేస్ను ÷ల్ అయింది.

# పోసాని వ్యాఖ్యలతో నిద్ర పట్టలేదు

- దారుణ విమర్శలతో హద్దులు దాటారు
- జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి

తిరుపతి,ఫిబ్రవరి27( వెలుతురు):



జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని కృష్ణమురళి చేసిన వ్యాఖ్యలు విని ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపాను అని జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి తెలిపారు. తమ నాయకుని కుటుంబ సభ్యుల గురించి మాట్లాడుతూ ఉంటే.. తాము కూడా మాట్లాడాలి అనుకున్నాం కానీ పవన్ వద్దని సూచించారని చెప్పారు. సంస్కారం అడ్డువచ్చే తాము అలా మాట్లాడలేదని, పోసాని ప్రవర్తన సరిగా లేకనే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. పోసానిపై గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఫిర్యాదులు చేసినా.. స్వీకరించలేదని జోగిమణి చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌పై అసభ్య పదజాలం వాడిన పోసానిని గత రాత్రి అన్నమయ్య జిల్లా ఓబులవారిప్లలె పోలీసులు అరెస్ట్ చేశారు.జోగిమణి మీడియాతో మాట్లాడుతూ 'జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని చేసిన వ్యాఖ్యలు విని ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపాను. మా అధినేత, కుటుంబ సభ్యుల గురించి మాట్లాడుతూ ఉంటే మేము కూడా మాట్లాడాలి అనుకున్నాం. కానీ మా నాయకుడు వద్దని సూచించారు. సంస్కారం అడ్డువచ్చే మేము మాట్లాడలేదు. అతని ప్రవర్తన సరిగా లేకనే ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. నేను ఎందుకు పుట్టాను, ఈ ఎదవ మానవ జన్మ అనే విధంగా మేము కూడా మాట్లాడగలం. గత ప్రభుత్వ హయంలో కూడా పోసానిపై ఫిర్యాదు చేశాం. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఫిర్యాదులు చేశాం, మా ఫిర్యాదులు స్వీకరించలేదు. మా నాయకుడికి భయపడి.. మేము అతనిలా బూతులు మాట్లాడలేదు. పోసాని మాట్లాడే మాటలు భరించలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. ఆయన మాటలకు మా మనోభావాలు దెబ్బతిన్నాయి. సోషల్ మీడియా ఉందని వారి ఇష్టానుసారంగా మాట్లాడితే సమంజసం కాదు. ఇకనుంచి ఎవరైనా సోషల్ మీడియా ఉందని ఎలా అంటే అలా మాట్లాడకూడదు, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఈ ఫిర్యాదు చేశా' అని తెలిపారు.

# అబద్ధాలు పదేపదే చెబితే నిజాలుకావు

- పచ్చిఅబద్ధాలతోనే పరిపాలన సాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- హైడ్రాతో కూరుకపోయిన రియల్టీరంగం
- రాష్ట్రంలో పడిపోతున్న ఆదాయం : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,ఫిబ్రవరి27( వెలుతురు):



రాష్ట్ర ప్రజలకు పదేపదే అబద్ధాలు చెబితే అవి నిజాలు అవిపోతాయని సీఎం రేవంత్‌రెడ్డి భ్రమిస్తున్నారని.. కానీ అలా ఎప్పటికీ కావనే నిజాన్ని ఆయన గుర్తించాలని ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.నెలకు రూ.6500 కోట్ల వడ్డీ కడుతున్నామని అబద్ధాలు చెబుతున్న సీఎం.. కాగ్ నివేదిక ప్రకారం ఏనెల కూడా రూ. 2600 కోట్లకు మించి వడ్డీ కట్టలేదని పేర్కొన్నారు. మరి రూ. 6500 కోట్లు కడుతున్నామని సీఎం ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు..? అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయంపై కూడా రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. ప్రతీ నెల 18 వేల కోట్ల ఆదాయం వస్తున్నదని సీఎం చెబుతున్నారు. కానీ కాగ్ ప్రకారం 12 వేల కోట్లకు మించి ఈ ఏడాది ఆదాయం రాలేదన్నారు. మరి ఈ అబద్ధలు లెక్కలు ఎందుకు చెప్తున్నట్లు..? ఎవరిని మభ్యపెట్టడానికి చెబుతున్నారు..? అని కవిత ప్రశ్నించారు. ఆదాయం పడిపోవడానికి ప్రధాన కారణం హైడ్రా అని తేల్చిచెప్పారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 18 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. కానీ హైడ్రా విధ్వంసం వల్ల దాని ద్వారా ఆదాయం 5800 కోట్లకు పడిపోయిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్బీసీ పనులే జరగలేదని సీఎం పచ్చి అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. కేసీఆర్ విశాల హృదయం తెలవాలంటే ఎస్ఎల్బీసీ విషయంలో అర్థమవుతుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఈ ప్రాజెక్టుపై కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ విషయంలో అప్పటి ప్రతిపక్ష నేత జానా రెడ్డిని ముందుపెట్టి కాంట్రాక్టర్‌కు 100 కోట్లు అడ్వాన్స్ కేసీఆర్ ఇచ్చారన్నారు. కరోనా తర్వాత కాంట్రాక్టర్ పనులు చేపట్టలేమంటే మళ్లీ 100 కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు 30 ఏళ్లలో ఈ ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చు 3340 కోట్లు. కానీ కేవలం 10 ఏళ్లలో కేసీఆర్ పెట్టిన ఖర్చు 3890 కోట్లు. ఇంత ఖర్చు పెట్టి 11 కీమీ మేర టన్నెల్ తవ్విస్తే ముఖ్యమంత్రి అబద్దాలు చెబుతున్నారని కవిత మండిపడ్డారు. సొంత జిల్లాలో సొంత ఊరు పక్కన విపత్తు జరిగితే పట్టించుకోకుండా సీఎం ఢిల్లీ వెళ్లారన్నారు. 8 మంది ప్రాణాలు చిక్కుకుంటే ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి వెళ్లడం సరికాదన్నారు. ఉత్తరాఖాండ్‌లో టన్నెల్‌లో కార్మికులు చిక్కుకుంటే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్లి వాళ్ల ప్రాణాలతో బయటపడేవరకు అక్కడే ఉన్నారని గుర్తుచేశారు. కానీ మన ముఖ్యమంత్రికి సోయి లేదు.. ఐరన్ లెగ్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగు ప్రాజెక్టులు కొట్టుకుపోయాయన్నారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటికీ అతీగతీ లేదు.. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు మీద మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోతే ప్రభుత్వం స్పందించలేదని దుయ్యబట్టారు. మేఘా కృష్ణా రెడ్డి కడుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లావద్దన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సుంకిశాల ప్రాజెక్టు మీద ఒకరు ఆర్టీఐ వేస్తే దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి జవాబు ఇవ్వమని ప్రభుత్వం చెప్పింది అని కవిత గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు ముఖ్యమా కాంట్రాక్టర్లు ముఖ్యమా..? అని నిలదీశారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉదిక్తతలు

- మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణలు
- ఒకరిపై ఒకరు రాళ్లురువ్వుకున్న కార్యకర్తలు.. పోలీసుల రంగ ప్రవేశం
- పరిస్థితిని సమీక్షించిన పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

మంచిర్యాల,ఫిబ్రవరి27( వెలుతురు):




తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రశాంతంగా, మరి కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా, నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. దీంతో బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు దూసుకెళ్లాయి. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించారు.స్థానిక ఎస్ఐ కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని స్థానిక బీజేపీ నేత కమలాకరరావు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్ఐ బీజేపీ నేతపై దాడి చేశారంటూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బీజేపీ శ్రేణులపై దూసుకువచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య పరస్పరం వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఒక నొక దశలో పరిస్థితి చేజారి ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సంఘటన ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కును 69,134 మంది పట్ట భద్రులు, 5,693 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు150 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్దతిలో ఓటింగ్ జరిగింది. ఎన్నికల విధుల్లో 1500 మంది సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో బందోబస్త్ ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఇక్కడ పురుష ఓటర్లు కీలకంగా ఉన్నాయి. అలాగే నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

# 15 వేల మంది ఉద్యోగుల సర్దుబాటు షురూ...



నెల్లూరు, ఫిబ్రవరి 27, ( వెలుతురు)
ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల్లో అదనపు సిబ్బంది లెక్క తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో 15,498 మంది సిబ్బంది అదనంగా ఉన్నట్టు గుర్తించారు. సచివాలయాల్లో జనాభా ప్రాతిపదికన ఎంత మంది పనిచేయాలో ఇప్పటికే ఖరారు చేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో 12,126 మంది అదనంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల్లో 3,372 మంది ఉన్నారు.సచివాలయ సిబ్బందిని వారి ఆసక్తి మేరకు విధులు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. మిగిలిన సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేస్తారు. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భావిస్తోంది. మరోవైపు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయడంపై ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయడంతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమన్వయం చేసి వాటిని పరిష్కరించేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తారు.ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో అదనంగా పనిచేస్తున్న ఉద్యోగుల్లో డిజిటల్ అసిస్టెంట్లు 173, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 414, గ్రామ మహిళా పోలీసులు 2107మంది, వీఆర్వోలు 2899, గ్రామ సర్వేయర్ అసిస్టెంట్లు గ్రేడ్ 3- 4,722, అగ్రికల్చర్ హార్టి కల్చర్, సెరి కల్చర్ అసిస్టెంట్లు 1154, ఎనర్జీ అసిస్టెంట్లు 405, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లు 252 మంది ఉన్నారు.పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాల్లో వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులు 37, మహిళా పోలీసులు 913, వార్డు రెవిన్యూ కార్యదర్శులు 1006, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు 1336, వార్డు, ఎనర్జీ కార్యదర్శులు 80 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే కొందరిని పట్టణ ప్రణాళిక శాఖకు తరలించారు.గ్రామ, వార్డు సచివాలయాలను మూడు క్యాటగిరీలుగా విభజించారు. 2500లోపు జనాభా ఉన్న సచివాలయాలను ఏ క్యాటగిరీలో, 2501 నుంచి 3500 లోపు జనాభాను బీ క్యాటగిరీగా, 3501పైగా జనాభా ఉన్న వాటిని సీ క్యాటగిరీలో చేర్చారు. 2500లోపు జనాభా ఉంటే ఆరుగురు ఉద్యోగుల పనిచేయాల్సి ఉంటుంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 3015 గ్రామ సచివాయాలు, 547 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 3562 సచివాలయాల్లో 2500లోపు జనాభా ఉంది.2501 నుంచి 3500 జనాభా ఉన్న సచివ్లాలయాలకు ఏడుగురు సిబ్బందిని కేటాయిస్తారు. ఈ విభాగంలో 3,884 గ్రామ సచివాలయాలు, 1504 వార్డు సచివాలయాలతో కలిపి మొత్తం 5,388 ఉన్నాయి.3501కు పైగా జనాభా ఉన్న సచివాలయాల్లో8మంది సిబ్బందిని నియమిస్తారు. ఈ విభాగంలో 4,263 గ్రామ సచివాలయాలు, 1791 వార్డు సచివాలయాలు ఉన్నాయి. సీ క్యాటగిరీలో మొత్తం 6054 సచివాలయాలు ఉన్నాయి.ఏపీలో ప్రస్తుతం 11,162 గ్రామ సచివాలయాలు, 3841 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయాలను వైసీపీ హయంలో ఏర్పాటు చేశారు.

# ముగిసిన వల్లభనేని వంశీ పోలీస్ కస్టడి



విజయవాడ,ఫిబ్రవరి27 ( వెలుతురు):
వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోలీసు కస్టడీ ముగిసింది. మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించడంతో కృష్ణలంక పీఎస్‌లో పటమట పోలీసులు ఆయన్ను విచారించారు. చివరిరోజు విచారణ ముగిసిన అనంతరం వంశీని విజయవాడ జీజీహెచ్‌కు తరలించి వైద్యపరీక్షలు చేయించారు. కస్టడీలో వంశీతో పాటు మరో ఇద్దరు నిందితులు లక్ష్మీపతి, శివరామకృష్ణను పోలీసులు విచారించారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రమేయం ఉన్నవారిపై ఆరా తీశారు. వంశీ చెబితేనే సత్యవర్ధన్‌ను తీసుకెళ్లినట్లు మిగతా నిందితులు చెప్పినట్లు సమాచారం. తనకేమీ తెలియదని పోలీసుల విచారణలో వంశీ పదేపదే చెప్పినట్లు తెలిసింది. దీంతో మరోసారి ఆయన్ను కస్టడీకి తీసుకుని విచారించాలని భావిస్తున్నారు.




# చీరకట్టులో మెరిసిన మలయాళ ముద్దుగుమ్మ పనుపమపరమేశ్వరన్



మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ముద్దుగుమ్మల్లో అనుపమ పరమేశ్వరన్ క్రేజే వేరు. ఈ చిన్నది తక్కువ సమయంలోనే విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అఆ సినిమాలో నటించింది. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించి మెప్పించింది అనుపమ. ఆతర్వాత ఈ బ్యూటీ క్రేజ్ పెరిగిపోయింది. సోలో హీరోయిన్ గా నటించిన సినిమాలన్నీ సూపర్ హిట్‌గా నిలిచాయి. యంగ్ హీరోలందరి సరసన నటించిన ఈ వయ్యారి తెలుగులో స్టార్ హీరోయిన్ క్రేజ్ ను సొంతం చేసుకుంది. అయితే అనుపమ పరమేశ్వరన్ ఇప్పటివరకు రొమాంటిక్ సీన్స్ లో నటించలేదు. అలాగే బోల్డ్ గానూ కనిపించలేదు. మొన్నామధ్య మాత్రం రౌడీ బాయ్స్ సినిమాలో లిప్ లాక్ తో షాక్ ఇచ్చింది. దాంతో అభిమానులంతా అవాక్ అయ్యారు. అనుపమ ఇలా లిప్ లాక్ తో రెచ్చిపోయిందేంటి అంటూ ఆశ్చర్యపోయారు. ఇక ఇప్పుడు సిద్దూ జొన్నలగడ్డ హీరోగా నటించిన టిల్లు స్క్వేర్ సినిమాలో హీరోయిన్ గా చేసింది అనుపమ. అయితే ఈ సినిమాలో అనుపమ మునుపెన్నడూ లేని విధంగా బోల్డ్ గా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం అనుపమ లేడీఓరియేంటేడ్ సినిమాలు చేస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీరకట్టులో కొన్ని ఫోటోలు షేర్ చేసింది . ఈ ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి.

# మా పుట్టబోయే పిల్లలపై కామెంట్స్ చేస్తున్నారు - ప్రియమణి

ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వరుస అవకాశాలు దక్కించుకుంటోంది అందాల తార ప్రియమణి . దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ ప్రియమణికి మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆమె సినిమాలు, సిరీస్, టీవీ ప్రోగ్రామ్స్‌తో బిజీ బిజీగా మారిపోయింది.



తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటి.. వివాహం అనంతరం ఎదురైన అనుభవాలను పంచుకుంది. మతాంతర వివాహం కారణంగా తాను లవ్ జిహాద్ ఆరోపణలను ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చింది. తనకు పుట్టబోయే బిడ్డల గురించి కూడా అనవసరంగా కామెంట్స్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. 2017లో ప్రియమణి ఈవెంట్ ఆర్గనైజర్ అయిన ముస్తఫా రాజ్‌ను ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2016లో వీరి నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన నాటి నుంచి తనపై విమర్శలు ఎక్కువయ్యాయని ప్రియమణి తెలిపింది. 'ఎనిమిదేళ్ల క్రితం మా వివాహం అయ్యింది. ఇప్పటికీ మా పెళ్లి విషయంలో ట్రోల్స్ చేస్తూనే ఉన్నారు. 2016లో నిశ్చితార్థం జరిగింది. ఈ ఆనందకరమైన విషయాన్ని అందరితో పంచుకోవాలనుకున్నా. ఇది తెలిసి అంతా సంతోషిస్తారని అనుకున్నా. బదులుగా నాపై అనవసరమైన ద్వేషం ప్రారంభమైంది. లవ్ జిహాద్ ఆరోపణలు వచ్చాయి. ఆ ద్వేషం ఎక్కడి వరకూ వెళ్లిందంటే.. మాకు పిల్లలు పుట్టాక వారు ఐసిస్‌లో చేరతారని చెప్పేంత వరకూ వెళ్లింది. ఆ కామెంట్స్ ఎంతగానో బాధించాయి. నేను మీడియా పర్సన్‌ను కాబట్టి విమర్శలను పట్టించుకోను. కానీ నా భర్తపై అలాంటి కామెంట్స్‌తో ఎందుకు దాడి చేస్తున్నారు..? నా భర్త గురించి వివరాలకు కూడా మీకు తెలీవు. కానీ కామెంట్స్ మాత్రం చేసేస్తారు. ఇప్పటికీ నేను నా భర్తతో దిగిన ఫొటోను పోస్ట్ చేస్తే.. పదిలో తొమ్మిది కామెంట్స్ మా పెళ్లి మీదనే ఉంటాయి. వాటి వల్ల బాధపడాల్సి వస్తోంది' అని ప్రియమణి ఆవేదన వ్యక్తం చేశారు.

# రజనీకాంత్ సరసన పూజా హెగ్డే ఫిక్స్

## అధికారికంగా తెలిపిన కూలీ మూవీ టీం



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రధారులు. ఆ సినిమాలో పూజా హెగ్డే నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే! అయితే ఇప్పుడు ఈ చిత్రంలో పూజా ఫిక్స్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా తెలిపింది. దీనికి సంబంధించి ఓ ప్రీ లుక్ పోస్టర్ విడుదల చేసి ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టాలంటూ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ ప్రీ లునిక్ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ఖరారు చేశారు. ఇందులో పూజా ఇందులో కీలక పాత్రలో నటించనున్నారా, ప్రత్యేక గీతంలో కనిపించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనిరుధ్ ఈ సినిమాకు 'జైలర్'లోని 'కావాలయ్యా' పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో.. రజనీ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. ఆమిర్‌ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు ఆగస్టులో రిలీజ్ చేసే అవకాశం ఉంది.



# కాయలోహర్ జాతకం మారిపోయింది!

మూడేళ్ళ క్రితం శ్రీవిష్ణు మూవీ 'అల్లూరి'లో నటించిన కాయదు లోహర్ తాజాగా 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మూవీతో మరోసారి తెలుగువారిని పలకరించింది. ఈ సారి ఈ మూవీని తెలుగువాళ్ళు బాగానే ఆదరించారు. తమిళ డబ్బింగ్ సినిమా అయినా... గత వారం విడుదలైన సినిమాలలో కాస్తంత ఆదరణ దీనికే లభించింది. దాంతో కాయదు లోహర్ పై మన నిర్మాతలు దృష్టి సారించారు. మరీ ముఖ్యంగా కాయదు తెలుగులో ఓ క్రేజీ ప్రాజెక్ట్ కు సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని డైరెక్ట్ గా కాయదు చెప్పలేదు కానీ ఓ తెలుగు సినిమాలో తనకు ఛాన్స్ లభించిందని తెలిపింది. ఈశాన్య భారత్ లో పుట్టిన కాయదు లోహర్ పెరిగింది పూణేలో. అయితే ఇప్పటికే అమ్మడు దక్షిణాది చిత్రాలను చుట్టేసింది. ఏ భాషా చిత్రంలో నటించానా ఆ భాషను నేర్చుకోవడానికి కాయదు గట్టిగా ప్రయత్నిస్తుంది. అలా ఇప్పటికే చక్కగా తమిళం మాట్లాడేస్తోంది. తెలుగులో 'అల్లూరి'లో నటించే సమయంలో కాస్తంత మన భాషనూ అర్థం చేసుకునే స్థితికి చేరింది. ఇప్పుడిప్పుడే క్యూట్ క్యూట్ గా తెలుగు పదాలను పలుకుతోంది. ఇంతకూ విషయం ఏమంటే... విశ్వక్ సేన్‌హీరోగా కె.వి. అనుదీప్ దర్శకత్వంలో సితార ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న 'ఫంకీ' మూవీలో కాయదు ఛాన్స్ దక్కించుకుంది. ఇవాళ సితార ఎంటర్ టైన్ మెంట్ సంస్థలోకి ఏ హీరోయిన్ అయినా అడుగుపెడితే... వాళ్ళ జాతకం మామూలుగా ఉండటం లేదు. వరుసగా అదే బ్యానర్ లో సినిమా ఛాన్సులు దక్కడమే కాదు... కలిసొస్తే... స్టార్ హీరోల పక్కన కూడా అవకాశం లభిస్తుంటుంది. అంత గొప్ప ఛాన్స్ దక్కడం పట్ల కాయదు ఫుల్ ఖుషీలో ఉంది.

# రాజమౌళిపై సంచలన కామెంట్స్

## ఆయన వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్

టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి రమా రాజమౌళి వివాదంలో చిక్కుకున్నారు. జక్కన్న స్నేహితుడైన యు.శ్రీనివాస్ రావు రాజమౌళి టార్చర్ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సుసైడ్ నోట్ రాయడంతో పాటు సెల్ఫీ వీడియో తీసి విడుదల చేయడం సంచలనంగా మారింది. రాజమౌళిది నాది 34 ఏళ్ళ స్నేహం. ఈటీవీలో రాజమౌళి శాంతి నివాసం సీరియల్ చెయ్యక ముందు నుంచే మేం ఇద్దరం ఫ్రెండ్స్. ఈ విషయం అందరికి తెలుసు. యమదొంగ సినిమాకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నేను చేశాను. కానీ రాజమౌళి జీవితంలో ఒక మహిళ ప్రవేశించడంతో నన్ను దూరం పెట్టారు. ముందు రాజమౌళి..ఆ తర్వాత నేను ఆ అమ్మాయిని ప్రేమించానని తెలిపాడు అయితే కెరీర్ బిగినింగ్ టైమ్‌లో వివాదం ఉందన్న కారణంతో రాజమౌళి కోరిక మేరకు నేను ఆ అమ్మాయిని త్యాగం చేశాను. రాజమౌళి వల్లే 54 ఏండ్లుగా బ్యాచిలర్‌గా మిగిలిపోయాను. ఆయన నెంబర్ వన్ అవ్వడం కోసం నా జీవితాన్నే త్యాగం చేశాను. రాజమౌళి స్టార్ డైరెక్టర్ అయ్యాక ఈ విషయం ఎవరికైనా చెప్తానని.. నన్ను ఇండస్ట్రీలో లేకుండా చేశాడు. చివరకి నేను చనిపోయే దాకా తెచ్చాడు. పోలీసులు కేసు ఫైల్ చేసి రాజమౌళికి రమ రాజమౌళికి లై డిటెక్టర్ టెస్ట్ చెయ్యాలి అంటూ సుసైడ్ నోట్‌లో రాసుకోచ్చాడు. రాజమౌళి క్షుద్ర విద్యలని వచ్చని.. అతడికి అడ్డుగా వస్తారని అనుకున్న దర్శకులందరనీ పక్కకు తప్పించి తానే నెంబర్ వన్ డైరెక్ట్ అయ్యాడని తెలిపాడు.

# బాలీవుడ్ నటి అమీషా పటేల్‌కు చేదు అనుభవం

బాలీవుడ్ నటి అమీషా పటేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివుడిని దర్శించుకునేందుకు ముంబై జుహూలోని ఓ శివాలయానికి వెళ్లారు అమీషా పటేల్. ఇక అమీషా పటేల్ వచ్చిందని తెలిసిన అక్కడి భక్తులు, బాబాలు ఒక్కసారిగా ఆమెని చూసేందుకు ఎగబడ్డారు. అమీషా ఆలయంలో



పూజలు చేస్తున్న సమయంలో అమెతో ఫొటోలు దిగేందుకు ఫ్యాన్స్‌తో పాటు సాధువులు సైతం పోటీ పడ్డారు. ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టి ఫొటోలు తీసుకున్నారు. అయితే సెల్ఫీల కోసం జనాలు ఎగపడటంతో అమీషా చాలా ఇబ్బంది పడింది. అది గమనించిన టెంపుల్ సెక్యూరిటీ వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయడంతో పాటు. అమీషాతో సెల్ఫీ దిగేందుకు ముందుకు వచ్చిన ఒక సాధువుని అక్కడి నుంచి లాక్కెల్లారు. ఇక బాబా నుంచి తనను రక్షించినందుకు టెంపుల్ సెక్యూరిటీ సిబ్బందికి అమీషా పటేల్ కృతజ్ఞతలు తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే గదర్ 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది అమీషా పటేల్. సన్నీ డియోల్ హీరోగా వచ్చిన ఈ చిత్రంలో అమీషా కథానాయికగా నటించింది. అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం దాదాపు రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.

# ఆస్కార్ విన్నర్ జీన్ హ్యాక్‌మాన్ మృతి

రెండు సార్లు అస్కార్ అవార్డు అందుకున్న జీన్ హ్యాక్‌మాన్.. అమెరికాలోని తన నివాసంలో శవమై తేలాడు. న్యూమెక్సికోలోని శాంటా ఫీ ఇంట్లో అతని మృతదేహాన్ని గుర్తించారు. ఆయన భార్య బెట్సీ అరకావా, కుక్క కూడా ఆ ఇంట్లో ప్రాణాలు కోల్పోయి ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. శాంటా ఫీ కౌంటీ పోలీసు అధికారి ఆడన్ మెండోజా ముగ్గురి మరణాలను ధ్రువీకరించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉన్నట్లు చెప్పారు. ద ఫ్రెంచ్ కనెక్షన్ చిత్రంలో నటించిన హ్యాక్‌మాన్‌కు ఆస్కార్స్‌లో బెస్ట్ యాక్టర్ అవార్డు దక్కింది. ఇక అన్‌ఫర్గీవన్ చిత్రంలో ఆయన బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ అవార్డు దక్కింది.




ఆస్కార్స్‌తో పాటు రెండు సార్లు బాఫ్టా, నాలుగు గోల్డెన్ గ్లోబ్ అవార్డులు గెలుచుకున్నాడు. జీన్‌హ్యాక్‌మాన్ 1930లో కాలిఫోర్నియాలో జన్మించారు. ఆయన వందకుపైగా పాత్రలు పోషించారు. ఏ కారణం చేత హ్యాక్‌మాన్ జంట ప్రాణాలు కోల్పోయిందో తెలియదని పోలీసు అధికారి చెప్పారు. 1970, 80 దశకాల్లో రిలీజైన సూపర్‌మాన్ చిత్రాల్లో ఆయన లెక్స్ లూథర్ పాత్రను పోషించారు. రన్ అవే జ్యూరీ, ద కన్వర్షేషన్, ద రాయల్ టీనెన్‌బౌమస్ లాంటి హిట్ చిత్రాలో ఆయన నటించారు. 2004లో చివరిసారి ఆయన వెల్కమ్ టు మూస్‌పోర్ట్ చిత్రంలో నటించారు. ఆయన ఆర్మీలో నాలుగున్నర ఏళ్లు పనిచేశాడు. మిలిటరీ తర్వాత కొన్నాళ్లు న్యూయార్క్‌లో చేశాడు. ఆ తర్వాత కెరీర్‌ను యాక్టింగ్ వైపు మళ్లించాడు.

## ఓటు వేసిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



**గుంటూరు,ఫిబ్రవరి27( వెలుతురు):**

ఎమ్మెల్సీ కే.ఎస్.లక్ష్మణరావు గుజానగుల్ల పాలిటెక్నిక్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని కేంద్రాలలో మా ఏజంట్లను అడ్డుకుంటున్నారని తెలిపారు. పట్ట భద్రులంతా తప్పకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని కేంద్రాలలో మా ఏజంట్లను అడ్డుకుంటున్నారని..ఇది అప్రజాస్వామికం అని అన్నారు. అమరావతి, పెదకూరపాడు, చుండూరు మండలాల్లో మా ఏజెంట్లను పోలింగ్ బూత్లలో కూర్చోవద్దని బెదిరిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. . తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఓటేసిన చంద్రబాబు, లోకేశ్



**అమరావతి,ఫిబ్రవరి27( వెలుతురు):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీ సీఎం చంద్రబాబు , మంత్రి నారా లోకేశ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానానికి గురువారం ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్దకు చంద్రబాబు, లోకేశ్ చేరుకుని ఓటు వేశారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ (కూటమి) కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

## గ్రామ సచివాలయాల్లో మిగులు సిబ్బంది గుర్తింపు

- క్షేతస్థాయిలో విజన్ అమలు యంత్రాంగంలో భర్తీకి కసరత్తు

**అమరావతి,ఫిబ్రవరి27( వెలుతురు):**

స్వర్ణాంధ్ర విజన్ -2047 అమలు దిశలో రాష్ట్రప్రభుత్వం జోరుగా కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో మిగులు సిబ్బందిని గుర్తించింది. వీరిని క్షేతస్థాయిలో విజన్ అమలు యంత్రాంగంగా వినియోగించుకోవాల ని భావిస్తోంది. ఎక్కడ అవసరమో అక్కడ పనిచేయించడం లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 15,498 మందిని మిగులు ఉద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు తేల్చింది. ఇందులో గ్రామ సచివాలయాల్లో 12,126 మంది, వార్డు సచివాలయాల్లో 3,372మంది మిగులు ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. గ్రామ సచివాలయాల్లో మిగులు ఉద్యోగుల్లో అత్యధికంగా సర్వేయర్లు (గ్రేడ్-3) 4,722మంది, గ్రామ మహిళా పోలీసులు 2,107 మంది, విఆర్ఓలు 2,899 మంది వార్డు ఎ÷-లానింగ్, రెగ్యులరేషన్ కార్యదర్శులు 1,336మంది ఉన్నారు. వార్డు సచివాలయాల్లో అత్యధికంగా వార్డు రెవెన్యూ కార్యదర్శులు 1,006మంది, వార్డు, ఎ÷-లానింగ్ రెగ్యులేషన్ కార్య దర్శులు 1,336మంది మిగులు సిబ్బందిగా తేలారు. వీరిలో అర్హులను 'విజన్-2047' విధుల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలిదశలో ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురు సిబ్బందికి విజన్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయిం చినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో విజన్ లక్ష్యాల అమలు తీరును పర్యవేక్షించడం, అందుకు అవసర మైన సూచనలు చేయడం వీరి ప్రధాన పనిగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు మారుమూల గ్రామాల్లో సైతం అమలయ్యేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం మార్చి నెలాఖరు నుండే 'విజన్' అమలు పక్రియ క్షేత్రస్థాయిలో ప్రారంభం కానుంది. మిగులు ఉద్యోగులుగా ఇప్పటికే గుర్తించిన వారి వివరాలను అందజేయాలని ప్రణాళికా శాఖ సచివాలయాల శాఖను ఇప్పటికే కోరింది. మిగులు ఉద్యోగుల్లో బిటెక్, ఎంటెక్ వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్న వారితో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, గ్రీన్ ఎనర్జీపై అవగాహన ఉన్న వారిని గుర్తించి విజన్ అమలు కోసం వినియోగించుకుంటామని అధికారులు చెబుతున్నారు.

## ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారు: అతిషి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి27( వెలుతురు):**




దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ సమావేశాల వేళ భాజపా సర్కారుపై ప్రతిపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ఈ మేరకు మాజీ సీఎం, శాసనసభలో ప్రతిపక్ష నేత ఆతిశీ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. 'భాజపా నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు దాటేశారు. సభలో జై భీమ్ అని నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. దిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదని ఆమె దుయ్యబట్టారు.

# మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

**అమరావతిఫిబ్రవరి27( వెలుతురు):**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ రెగ్యులర్, ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు మార్చి నుంచి ప్రారంభంకానున్నాయి. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో మార్చి 1 నుంచి 19 వరకు ఫస్ట్ ఇయర్, మార్చి 3 నుంచి 20 వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 26 జిల్లాల్లో దాదాపు 10,58,892 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు జరగనున్నాయి.పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవడానికి వీలుగా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. విద్యుత్తు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు అధికారుల సమక్షంలో భద్రపరిచి.. ఎలాంటి లీకేజీలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టడంతో పాటు ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు సదుపాయాలను అధికారులు పూర్తి చేశారు. అయితే ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కూడా ఇప్పటికే ఇంటర్ బోర్డు జారీ చేసింది. హాల్‌టికెట్లను విద్యార్థులే నేరుగా ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ఈ పర్యాయం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. మరోవైపు పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెగ్యులర్ ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1535 కేంద్రాలను ఏర్పాట్లు చేయగా.. అందులో 68 సెంటర్లను సున్నిత, 36 కేంద్రాలను అతి సున్నితమైనవిగా అధికారులు గుర్తించారు. వీటన్నింటిలో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను సీసీ కెమెరాలతో అనుసంధానించి అమరావతిలోని చీఫ్ సూపరింటెండెంట్ లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధించనున్నారు. అలాగే చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు, ఇంటర్ నెట్ కేంద్రాలు పూర్తిగా మూసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 18004251531 ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను కూడా నెలకొల్పనున్నారు..పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టిపరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించేది లేదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కూడా మొబైల్ ఫోన్లను పరీక్ష కేంద్రానికి బయటే వదిలేసి వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంది.

# మరోమారు వక్రబుద్ధి చూపించుకున్న పాకిస్థాన్

- జెనీవా వేదికగా కాశ్మీర్ ప్రజాస్వామ్యంపై గగ్గోలు
- ధీటుగా తిప్పికొట్టిన భారత ప్రతినిధి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి27 ( వెలుతురు):**




అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతున్న పాకిస్థాన్‌కు మరోమారు భారత్ ధీటుగా బదులిచ్చింది. నోరు మూసుకునేలా చేసింది. దాని కుత్సిత బుద్దిని బయటపెట్టింది. తాజాగా జమ్ముకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయాది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో ఆ దేశం లేదని స్పష్టం చేసింది జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి దీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు. ఆ దేశ వాక్‌చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తుంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టిసారిస్తుంది. ఆ దేశం మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టిపెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు. ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తంచేసింది. ముందుగా దీనిని సరిదిద్దుకోవాలని సూచించింది.

# మహాకుంభమేళాలో 66కోట్ల మంది పుణ్యస్నానాలు

- రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిచాయి
- వివరాలు వెల్లడించిన యూపి ప్రభుత్వం



**లక్నో,ఫిబ్రవరి27( వెలుతురు):**

మహా కుంభమేళా విజయవంతంగా ముగియడంతో ఎంతమంది వచ్చారన్న లెక్కలను యూపి ప్రభుత్వం తీసింది. ప్రయాగ్‌రాజ్‌లో దాదాపు 45 రోజుల పాటు మహా కుంభమేళా జరిగింది. ఫిబ్రవరి 26న మహా శివరాత్రితో కుంభమేళా గ్రాండ్‌గా ముగిసింది. కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అంతేకాకుండా కోట్లలో బిజినెస్ కూడా నడిచింది. ఇందుకు సంబంధించిన వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగంలో దాదాపు 66 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లుగా ప్రభుత్వం తెలిపింది. ఇక రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిచాయని పేర్కొంది. పరోక్షంగా.. ప్రత్యక్షంగా 60 లక్షల మంది జీవనోపాధి పొందినట్లుగా వెల్లడించింది. దాదాపు 150 కి.మీ మేర వ్యాపారాలు జరిగాయని పేర్కొంది. ప్రపంచంలోనే ఇంత పెద్ద మతపరమైన పండుగ ఇదేనని పరమార్థ నికేతన్ అధ్యక్షుడు స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. ప్రయాగ్‌రాజ్ ఒక చరిత్ర సృష్టించిందని చెప్పారు.యాత్రికులకు ఆర్థిక సౌలభ్యం కల్పించడానికి 16 బ్యాంకులు ప్రాంగణంలో శాఖలను ఏర్పాటు చేశాయి. ఈ బ్యాంకులు రూ. 37 కోట్ల విలువైన లావాదేవీలను నిర్వహించాయి. వీటిలో ఎక్కువ డిపాజిట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో నమోదయ్యాయి. గణనీయమైన సంఖ్యలో భక్తులు నగదు జమ చేశారని, ఉపసంహరణలు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. మైదానంలో 50 మొబైల్ ఎటిఎంలతో సహా 55 ఎటిఎంబూత్‌లు ఏర్పాటు చేశారు. అయితే డిజిటల్ లావాదేవీలు పెరగడంతో ఎటిఎంలకు డిమాండ్ తక్కువగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 76 దేశాల ప్రతినిధులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. భారతీయ సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వారసత్వంపై అంతర్జాతీయంగా ఆసక్తిని కనుబరిచారు. భూటాన్ రాజు, వివిధ దేశాల మంత్రులు మరియు ప్రముఖులతో కలిసి సంగమంలో పవిత్ర స్నానం చేశారు. నేపాల్ నుంచి 50 లక్షలకు పైగా భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించగా? 27 ఇతర దేశాల నుంచి రెండు లక్షలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ భార్య సందర్శించారు.అలాగే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, అనేక మంది కేంద్ర మంత్రులు సహా భారతదేశ అగ్ర నాయకత్వం పాల్గొంది. గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ వంటి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, అక్షయ్ కుమార్ వంటి బాలీవుడ్ ప్రముఖులు ఈ ఉత్సవానికి హాజరయ్యారు. తాజాగా దీన్ని పురస్కరించుకుని ప్రధాని మోడీ ఎక్స్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'మహా కుంభమేళా పూర్తయింది. ఐక్యత మహా యజ్ఞం పూర్తయింది. 45 రోజుల పాటూ ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభ మేళాలో 140 కోట్ల దేశ ప్రజల విశ్వాసం అద్భుతమైంది.' అంటూ కొనియాడుతూ మోడీ రాసుకొచ్చారు.

# గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు

## బ్లూమ్‌బర్గ్ కథనంలో వెల్లడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి27( వెలుతురు):**




ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తాజాగా ఉద్యోగుల తొలగింపు పక్రియ చేపట్టింది. క్లౌడ్ డివిజన్‌లోని ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈవిషయాన్ని వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందనే విషయం మాత్రం తెలియరాలేదు. వంద మందికి పైగా ఉండొచ్చని, అది కూడా కొన్ని టీమ్స్‌పై మాత్రమే తొలగింపుల ప్రభావం ఉందని తెలుస్తోంది. ఇదంతా కూడా ఖర్చు తగ్గించుకునే ప్రయత్నంలో భాగమని అంటున్నరు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం వ్యాపారానికి కీలకమైన రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. అందులోభాగంగా కొన్ని మార్పులు చేస్తున్నామని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది. 2025 మూలధన వ్యయాలు కూడా అంచనాలకు మించిపోయాయి. ఈనేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం గమనార్హం.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com